
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
3
శుక్రవారం 10 అక్టోబరు 2025



గరిష్ఠం 29.5
కనిష్ఠం 23.4

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	83,491	83,491
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.60 (4.36)	4842..45	3047.66
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.144 (41.4373)	66,230	37,423

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



స్థానిక ఎన్నికలకు బ్రేక్

స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్‌పడింది. తొలివిడతలో జరగాల్సిన పరిషత్ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ సైతం విడుదలైనా సాయంత్రానికి హైకోర్టు స్టే విధించడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచినట్లయింది. ఎన్నికల నామినేషన్ల ఘట్టం మొదలైన కొద్దిగంటల్లోనే ప్రక్రియ నిలిచిపోవడంతో ఆశావహుల్లో నైరాశ్యం నెలకొంది. అయితే కోర్టు స్టే విధించడంతో పాత రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలకు వెళ్లే ఛాన్స్‌పై అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- బీసీ రిజర్వేషన్లు, ఎన్నికల నిర్వహణపై ఆరువారాలు స్టే విధించిన హైకోర్టు
- నిరుత్సాహంలో ఆశావహులు

ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన హైకోర్టు తీర్పు రానే వచ్చింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని, ఈ రిజర్వేషన్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.9ను కొట్టివేయాలని హైకోర్టులో దాఖలైన పిటిషన్‌ను విచారణ చేపట్టిన ప్రత్యేక ధర్మాసనం గురువారం సాయంత్రం జీవో అమలును నాలుగువారాలపాటు నిలిపివేయాలని, అదేవిధంగా ఎన్నికల ప్రక్రియను సైతం ఆరు వారాలపాటు నిలిపివేస్తూ స్టే ఇచ్చింది. పరిషత్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం మొదలైన కొద్దిగంటల్లోనే ప్రక్రియ నిలిచిపోవడంతో రాజకీయపార్టీల నేతల్లో ప్రధానంగా కాంగ్రెస్ నాయకులు, స్థానిక ఎన్నికల్లో పోటీచేసేందుకు సిద్ధమయిన ఆశావహుల్లో నిరుత్సాహం నెలకొంది.

పాతరిజర్వేషన్ల ప్రకారం వెళ్లే ఛాన్స్



బీసీలకు 42శాతం రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలగా ఉన్నప్పటికీ హైకోర్టు ముందు జీవో నిలబడకపోతే తదుపరి ఏం చేస్తారనే అంశంలో భిన్న అంశాలు తెరమీదకు వస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలను తప్పకుండా నిర్వహించాల్సిన పరిస్థితి ఒకవైపు నెలకొంటే, మరోవైపు బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉండడంతో అధికార కాంగ్రెస్ ఎలాంటి నిర్ణయంతో ముందుకెళుతుందనే అంశం తేలాల్సి ఉంది. అయితే హైకోర్టులో ఆరువారాల తర్వాత వచ్చే తీర్పు బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా ఉంటే ఎలాంటి ఇబ్బంది లేకుండా తాజాగా ప్రకటించిన రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళతారని భావిస్తున్నారు. 42శాతం రిజర్వేషన్ల జీవోను హైకోర్టు కొట్టివేస్తే మాత్రం 2018లో అమలు చేసిన రిజర్వేషన్ల కోటా ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ముఖ్యులు ప్రభుత్వానికి సూచిస్తున్నట్లు చర్చ సాగుతోంది. అధికారికంగా బీసీలకు 23శాతం రిజర్వేషన్ ఇస్తూ, పార్టీపరంగా 42శాతం బీసీ అభ్యర్థులను బరిలో ఉంచి పార్టీ పరంగా రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అయితే రిజర్వేషన్లను ప్రస్తుతం ప్రకటించిన మేరకు ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు అలాగే కొనసాగిస్తారా?..? లేక అన్ని కేటగిరీల రిజర్వేషన్లను మళ్లీ కేటాయించి ప్రకటిస్తారా?? అనే విషయం తేలాల్సి ఉంది. మొత్తంగా ప్రభుత్వం తీసుకునే విధాన నిర్ణయం...

- మిగతా 5వ పేజీలో...

జిల్లాలో ఎన్నికల పరిశీలకురాలి పర్యటన



కలెక్టర్, అధికారులతో సమావేశమైన ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మి

నల్లగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జడ్పీటీసీ గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు, ఐఏఎస్ అధికారి కొర్ర లక్ష్మి జిల్లాలో పర్యటించారు. జిల్లాకు వచ్చిన సందర్భంగా గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠితోపాటు పలువురు అధికారులు స్వాగతంపలికారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీవో అశోక్ రెడ్డి, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి రాజ్ కుమార్, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, పీపీవో వెంకయ్య, పశుసంవర్ధకశాఖ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కనగల్: నామినేషన్ స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మి ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని గురువారం కలెక్టర్‌తో కలిసి ఆమె పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీనివాసరావున, డీపీవో కె.వెంకయ్య, పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

సైన్స్‌తోనే మానవ మనుగడ

- డీఈవో బొల్లారం భిక్షపతి



విజేతలకు మెమొంటోలు అందజేస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సైన్స్‌పైనే మానవ మనుగడ ఆధారపడి ఉందని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. గురువారం ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైన్స్ డ్రామాలలో మహిళల పాత్ర, స్మార్ట్ వ్యవసాయం, డిజిటల్ ఇండియా, అందరికీ పరిశుభ్రత, గ్రీన్ టెక్నాలజీ అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన నాటకాలు ఆకట్టుకుంటున్నాయన్నారు. జిల్లా ప్రథమ స్థాయి విజేతలు ఈ నెల 17, 18వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, సాధియా పరహీన్, తస్లీమ్ ఫాతిమా, జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక.. లతీఫుల్లా షాఖాద్రి ఉర్సు

- ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్



గంధం ఊరేగిస్తున్న ముస్లింలు

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం గడియారం సెంటర్‌లోని చారిత్రాత్మకమైన హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి ఉర్సు మత సామరస్యానికి ప్రతీక అని శాసన మండలి సభ్యుడు కేతావత్ శంకర్‌నాయక్, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని మదీనా మసీదులో ప్రార్థన నిర్వహించి గంధం ఊరేగింపును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దర్గాకు వెయ్యేళ్ల చరిత్ర ఉందని, జిల్లా ప్రజలే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు దర్గాను దర్శించుకుంటారన్నారు. హిందువులు, ముస్లింలు ఐక్యమత్యంతో జరుపుకునే ఉత్సవమని, ఇదే సాంప్రదాయాన్ని భవిష్యత్‌లో కొనసాగించాలన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేకశ్రద్ధ తీసుకొని నిధులు మంజూరు చేయించి భక్తుల సౌకర్యం కోసం దర్గాకు ఘాటు రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాలు నెల రోజులపాటు భక్తితో సాగుతాయన్నారు. అనంతరం పట్టణ పురవీధులగుండా గంధం ఊరేగింపు సాగింది. గుట్టమెట్ల దగ్గరికి చేరుకోగానే జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు గంధానికి స్వాగతం పలికి దర్గాపైకి తీసుకెళ్లారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గంధాన్ని అదనపు ఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ప్రారంభించారు. గంధం ఊరేగింపులో మార్ఫా వాయిద్య కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. దర్గా ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సీఐలు, ఎస్‌ఐలు తమ పోలీస్ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ఠాగూర్, శివ, ముతవలులు సమీఉల్లాఖాద్రి, జమాల్‌ఖాద్రి, ఉబేద్‌ఖాద్రి, సల్మాన్ ఖాద్రి, హాశం, ఇంతియాజ్ హుస్సేన్, మాజీ కౌన్సిలర్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు రెండు.. అంతలోనే ఆగిపోయే

నల్లగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తొలిరోజు రెండు ఎంపీటీసీ స్థానాలకు మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి. జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్లు ఒక్కటి కూడా దాఖలు కాలేదు. కనగల్ మండలం జి.యడవల్లి ఎంపీటీసీ స్థానానికి బీజేపీ అభ్యర్థి ఒక నామినేషన్ వేయగా, నార్కట్‌పల్లి-1 ఎంపీటీసీ స్థానానికి బీజేపీ అభ్యర్థి ఒక నామినేషన్ వేశారు. ఇంతలోనే హైకోర్టు ఎన్నికల ప్రక్రియను, నోటిఫికేషన్‌ను నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. చాలామంది అభ్యర్థులు హైకోర్టు తీర్పు వెలువడే వరకు వేచి చూడాలని ఆలోచించినందునే గురువారం నాడు పెద్దగా నామినేషన్లు దాఖలు చేయలేదని సమాచారం. మొదటి దశలో 18 జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ చేపట్టగా ఒక నామినేషన్ కూడా దాఖలుకాలేదు. 196 ఎంపీటీసీ స్థానాలకు రెండే రెండు నామినేషన్లు వచ్చాయి. మొత్తంగా ఎన్నికల ప్రక్రియ నిలిచిపోవడంతో అభ్యర్థులు నిరాశ చెందారు.

బీసీ రిజర్వేషన్లపై కుట్రలను తిప్పికొట్టాలి



గడియారం సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

నల్లగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ఆధిపత్య శక్తుల కుట్రలను తిప్పి కొట్టాలని విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లాకేంద్రంలోని గడియారం సెంటర్‌లో బీసీ విద్యార్థుల సంఘం అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ ఉద్యమాల ఫలితంగా రాష్ట్ర అసెంబ్లీలో 42శాతం రిజర్వేషన్లపై ఏకగ్రీవంగా ఆమోదం తెలిపి గవర్నర్‌కు పంపారన్నారు. రిజర్వేషన్ల పెంపును అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 60 శాతానికి పైబడి బీసీలుండగా, 42శాతానికి అంగీకరించినప్పటికీ బీసీల ఫలాలను అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. బీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇస్తుంటే ఎవరు అడ్డుకున్నా ఊరుకోబోమన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, సతీష్ కుమార్, విజయ్ కుమార్, రాజు, రవి కుమార్, శ్రీకాంత్, తరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రావడానికి ఓటు చోరీ

- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్, చిత్రంలో గుమ్మల మోహన్ రెడ్డి, బుర్రి శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో అధికారంలోకి రావడానికి బీజేపీ ఓటు చోరీ చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. ఓటు చోరీపై జిల్లాకేంద్రంలోని 31వ వార్డులో గురువారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలో కూడా బీజేపీ ఓటు చోరీకి పాల్పడిందని ఆరోపించారు. రాత్రికి రాత్రే 60 లక్షల ఓట్లు నమోదు చేసిందన్నారు. దీనిని నిరసిస్తూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాదయాత్ర చేపట్టారని చెప్పారు. రాహుల్‌గాంధీ పిలుపు మేరకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రతీ గ్రామంలో 100కుపైగా సంతకాల సేకరణ నిర్వహించి రాష్ట్రపతికి, ఎన్నికల కమిషనర్‌కు పంపిస్తామన్నారు. ఈ నెల 15 వరకు జరిగే సంతకాల సేకరణ కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుమన్ పాల్గొన్నారు.


సీజేఐపై దాడి హేయమైన చర్య

ఖండించిన ప్రజాసంఘాల నేతలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మువ్వా రామారావు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని ప్రజసంఘాల నేతలు ఖండించారు. పట్టణంలోని జ్యోతిబా పూలే భవనంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా జనవిజ్ఞానవేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ మువ్వా రామారావు మాట్లాడుతూ సీజేఐపై జరిగిన దాడి దేశ సర్వోన్నత న్యాయస్థానం, భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన దాడిగా భావించక తప్పడం లేదని, ఈ సంఘటన దేశ చరిత్రలో చీకటిరోజుగా గుర్తుండిపోతుందన్నారు. ప్రధాన న్యాయమూర్తిపై కోర్టు ఆవరణలో దాడి జరిగితే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. భావప్రకటన స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. విద్యా వికాసవేదిక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, భారత్ బచావో జిల్లా అధ్యక్షురాలు ఉదయ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కేవీపీఎస్ నాయకులు పరుశరాములు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సామాజిక కార్యకర్త డాక్టర్ జాడి రాజు, ప్రజాసంఘాల నాయకులు సత్యనారాయణ, రవినాయక్, కే. సుదర్శన్, హరికృష్ణ, యల్లయ్య, కాశీ, కిరణ్మయి, దశరథనాయక్, రాజారత్నం, సైదులు, స్వామి, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



6


తిప్పర్తి మండల పరిధిలోని జంగారెడ్డిగూడెంలో నేలకొరిగిన వరి

కురిసిన వాన.. పంటకు నష్టం

జిల్లాలోని పలు మండలాల్లో గురువారం వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో పంట చేలోకి నీరు చేరి, నేలకొరిగింది. దీంతో చేతికొచ్చిన పంట నేలవాలడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

బాలాజీ నాయక్ కోసం పోలీసుల వేట

- డిపాజిట్ల చట్టం కింద సుమోటోగా కేసు నమోదు



నల్లగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): అధికవడ్డీల ఆశ చూపి భారీగా నగదు సమీకరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలాజీ నాయక్ కోసం పోలీసులు వేట మొదలుపెట్టారు. పీఏపల్లి మండలం పలుగుతండాకు చెందిన ఆర్.బాలాజీ నాయక్‌పై డిపాజిట్ల చట్టం కింద పోలీసులు సుమోటోగా కేసు నమోదుచేసి, అతన్ని పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. ఇటీవల అప్పులిచ్చిన వారు బాలాజీ నాయక్ ఇంటిపై దాడిచేసి ఫర్నిచర్ ధ్వంసం చేయడం, అతనికి అప్పులిప్పించిన ఏజెంట్‌గా భావిస్తోన్న సరియా నాయక్ ఆత్మహత్య చేసుకోవడం వంటి కారణాల నేపథ్యంలో ఈ కేసు నమోదుచేశారు. వాస్తవానికి జూన్‌లోనే బాలాజీనాయక్ చట్టాలను అతిక్రమించి అధికవడ్డీల పేరుతో దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ ప్రాంతాల్లో కోట్లాది రూపాయల నగదు సేకరిస్తున్నారని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దేవరకొండకు చెందిన ఒక స్వచ్ఛంద సంస్థ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై విచారణ జరపాలని అప్పట్లోనే నల్లగొండ ఎస్పీకి, ఆదాయపన్ను శాఖాధికారులకు సూచించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పోలీసులు విచారణ చేయగా, పెద్దమనుషుల సమక్షంలో బాలాజీ నాయక్ అప్పులిచ్చిన వారికి మూడు నెలల్లోగా అందరికీ డబ్బులు తిరిగి ఇచ్చేస్తానని హామీ ఇవ్వడంతో వారెవరూ పోలీస్‌లకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. తాజాగా 15 రోజుల నుంచి మళ్లీ బాలాజీనాయక్ అందుబాటులో లేకుండా పోయారని, ఫోన్లు సైతం పనిచేయడం లేదని పేర్కొంటూ అప్పులిచ్చిన వారిగా చెబుతున్న పలువురు, కమీషన్లకు ఆశపడి మధ్యవర్తులుగా ఉన్నవారు ఆందోళన చెందుతుండడంతో మళ్లీ విషయం వెలుగులోకి వచ్చింది. స్వగ్రామమైన పలుగుతండాలో ఇంటి నుంచి బాలాజీనాయక్ తల్లిదండ్రులు సైతం వెళ్లిపోవడంతో అనుమానం చెందిన అప్పుల వాళ్లు ఇటీవల ఇంటిపై దాడిచేసి నిప్పుపెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా విషయం సంచలనంగా మారడంతో పోలీసులు స్పందించి సుమోటోగా కేసు నమోదు చేశారు. బాలాజీ నాయక్ ఆస్తుల వివరాలు చెప్పాలని రెవెన్యూ శాఖను పోలీస్ శాఖ కోరింది. తాజాగా గురువారం సైతం బాలాజీ నాయక్‌కు అప్పులిచ్చానని పేర్కొంటూ పలుగుతండాకే చెందిన లోక్యానాయక్ ఆత్మహత్యకు పాల్పడడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇదే సమయంలో బాలాజీనాయక్ అందుబాటులోకి రాకపోవడంతో మిర్యాలగూడలోని అతని సోదరుడి ఇంటివద్ద, నేరేడుచర్లలోని సోదరి ఇంటివద్దకు అప్పులిచ్చినవారు చేరుకొని ఆరా తీస్తున్నారు. బాలాజీ నాయక్‌కు అప్పులిచ్చిన వారు, అతని బాధితులు ఎవరైనా ఎవరికీ భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని కొండమల్లేపల్లి సీఐ నవీన్ కుమార్ తెలిపారు. బాలాజీ నాయక్‌పై రెండు రోజుల క్రితమే కేసు నమోదైందని, మరో రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామని దేవరకొండ ఏఎస్పీ మౌనిక తెలిపారు.

పోషకాహారంతోనే రక్తహీనత దూరం

- సీడీపీవో చంద్రకళ



కేజీబీవీలో విద్యార్థినులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో చంద్రకళ.

మాడ్గులపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ప్రతినిత్యం పోషకాహారం తీసుకున్నట్లయితే రక్తహీనతకు దూరంగా ఉండవచ్చని సీడీపీవో చంద్రకళ అన్నారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా గురువారం కుక్కడం కేజీబీవీలో ఆమె కిషోర బాలికలకు పోషకాహారం, రక్తహీనతపై అవగాహన కల్పించి మాట్లాడారు. కిషోర బాలికలు ప్రతీరోజు తాము తీసుకునే ఆహారంలో తప్పనిసరిగా విటమిన్లు, మినరల్స్ వంటి పోషకాలు కలిగిన ఆహారాన్ని తప్పక తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగమణి, లక్ష్మి, కేజీబీవీ ఎస్‌వో వసంత, కేజీబీవీ టీచర్లు, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్‌ఎం ఝాన్సీ అంగన్‌వాడీ టీచర్లు ఊర్మిళ, జానకి, తిరుపతమ్మ, రజిత, సుశీల, మరియమ్మ, ఆశాలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ప్రత్యేక అలంకారంలో లక్ష్మీ నృసింహులు

5

పాఠశాలను పునఃప్రారంభించాలి



ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నల్లగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పిల్లల భవిష్యత్ దృష్ట్యా పాఠశాలను పునఃప్రారంభించాలని ది మాస్టర్ మైండ్ హైస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ది మాస్టర్ మైండ్ స్కూల్ వద్ద గురువారం వారు ఆందోళన చేపట్టారు. కొద్దిరోజుల కిందట స్కూల్ బస్ కిందపడి ఓ చిన్నారి చనిపోయింది. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలను సీజ్ చేశారు. అయితే పిల్లలను వేరే పాఠశాలలో చేర్పించాలని తాము ప్రయత్నించినప్పటికీ విద్యాసంవత్సరం ముగింపు దశలో చేర్పించుకోవడం లేదని తల్లిదండ్రులు తెలిపారు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా పాఠశాలను పునఃప్రారంభించి తరగతులు నిర్వహించాలని కోరారు.

మాస్టర్ మైండ్ పాఠశాల యజమాన్యం నిర్లక్ష్యం స్పష్టంగా తేలింది: కలెక్టర్

పాఠశాల విద్యార్థుల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాల విద్యార్థులతో ఎవరు నిర్లక్ష్యం వహించినా సహించేది లేదన్నారు. సెప్టెంబరు 4వ తేదీన మాస్టర్ మైండ్ పాఠశాల బస్సు కిందపడి చిన్నారి జశ్విత మృతి చెందడం బాధాకరమన్నారు. పాఠశాలలో జరిగిన సంఘటనపై విచారణ సందర్భంగా యజమాన్య నిర్లక్ష్యం స్పష్టంగా తేలిందన్నారు. పాఠశాల గ్రౌండ్‌లో విద్యార్థులు తిరుగుతున్నా బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపటం వంటి అంశాలు విచారణ దృష్టికి వచ్చాయన్నారు. అందుకే ఆ పాఠశాలను సీజ్ చేశారు. అయితే పాఠశాలలో చదివే విద్యార్థులకు నష్టం జరగకూడదన్న ఉద్దేశ్యంతో మానవతా దృక్పథంతో నోటీసులు జారీ చేసి పాఠశాలను తాత్కాలికంగా మాత్రమే సీజ్ చేశామని, తప్ప ఎలాంటి కక్ష సాధింపు చర్యలు కావని స్పష్టం చేశారు. జిల్లా పాలనాధికారిగా, ఓ తల్లిగా తీసుకున్న ఈ చర్యపై తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్‌లు సైతం ఆలోచించాలన్నారు. మాస్టర్ మైండ్ పాఠశాల బస్సు సంఘటనపై హైకోర్టు పూర్వాపరాలను పరిశీలించిన మీదట పాఠశాల యజమాన్యంపై కొత్తగా చర్యలు తీసుకునే స్వేచ్ఛను జిల్లా యంత్రాంగానికి ఇస్తూ ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా త్వరలోనే విద్యార్థుల భద్రత కోసం అన్ని పాఠశాలల్లో ఆడిట్ నిర్వహిస్తామని తెలిపారు.

బాలాజీనాయక్ మరో బాధితుడి ఆత్మహత్యాయత్నం

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పలుగు తండాలో అధికవడ్డీ బాధితుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. గురువారం మరో బాధితుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇదేతండాకు చెందిన సరియానాయక్ మూడురోజుల కిందట ఆత్మహత్యాయత్నం చేసి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం ఉదయం పోలీసుల బందోబస్తుల నడుమ అంత్యక్రియలు ముగిశాయి. అది మరువకముందే అదే తండాకు చెందిన రమావత్ లోక్యా గురువారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే కుటుంబసభ్యులు అతడిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. వరుస ఘటనలతో పలుగు తండా గ్రామస్థుల్లో ఆందోళన మొదలైంది. అధికారులు చొరవ తీసుకుని తమ డబ్బులు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

ఆత్మహత్యలు సరికాదు: ఎస్ఐ నర్సింహులు

అధికవడ్డీ బాధితులు ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదని గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు సూచించారు. అధిక వడ్డీ బాధితులు ఎవరైనా సరే తమ వద్దకు వచ్చి నేరుగా ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుని బాధితులకు బాసటగా నిలుస్తామన్నారు. ఆత్మహత్యాయత్నాలతో ప్రాణాల మీదకు తెచ్చుకోవడం సరికాదని సూచించారు.

విద్యుత్ లైన్‌మన్ సస్పెన్షన్

హుజూర్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌మన్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈ వెంకటకృష్ణయ్య తెలిపారు. గురువారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నడిగూడెం మండలం బీబీపురం గ్రామంలో నక్కలగుట్ట వద్ద పారిపల్లి వెంకన్న, వ్యవసాయ పొలం వద్ద 63కేవీ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అనధికారికంగా ఏర్పాటుచేసిన సంఘటనలో లైన్‌మన్ కాసాని శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. నడిగూడెం మండలానికి చెందిన నక్కా సైదులు, గుండు గోపయ్య, గుండు శ్రీనివాసు, కాసాని సతీష్ అనే నలుగురు రైతులు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ కోసం గతేడాది ఫిబ్రవరి 26న రెండు డీడీలు చెల్లించారని వాటికి సంబంధించి అదే ఏడాది ఆగస్టు 16న మంజూరు జరిగిందన్నారు. దాని ప్రకారం ఓఆర్‌సీ 1,62,747 రూపాయలు చెల్లించాల్సి ఉందన్నారు. కాగా ఆ మొత్తం వినియోగదారుల నుంచి వసూలు చేయకుండానే నడిగూడెం సెక్షన్ కార్యాలయంలోని 63కేవీఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అనధికారికంగా మళ్లించి 8 నెంబర్ల విద్యుత్ స్తంభాలను ఉపయోగించి సుమారు 320 మీటర్ల 11 కేవీ లైన్ ఏర్పాటుచేసినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సంస్థకు నష్టం కలిగించినందుకు లైన్‌మన్ కాసాని శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా నడిగూడెం ఆపరేషన్ ఏఈ కె.సైదయ్యపై చర్యలు తీసుకోవాల్సిందిగా సూర్యాపేట జిల్లా ఆపరేషన్ ఎస్ఈకి సిఫార్స్ చేసినట్లు డీఈ వెంకటకృష్ణయ్య తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తిప్పర్తి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం ఉదయం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం రాయిగూడెం సమీపంలో జరిగింది. రైల్వే ఎస్ఐ బీ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం సుమారు వయస్సు(50) వ్యక్తి తిప్పర్తి మండలంలోని రాయినిగూడెం-నల్లగొండ మధ్య 84/14 మైలురాయి వద్ద గుర్తుతెలియని రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. రైల్వే స్టేషన్ మాస్టర్ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712658595, 9949925859కి సమాచారం అందించాలని తెలిపారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.

సాగర్‌కాల్వలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మునగాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని నాగార్జున సాగర్ ఎడమకాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ బీ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం సాగర్ ఎడమకాల్వ ముక్త్యాల బ్రాంచి కాల్వలో బరాఖత్‌గూడెం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించిందని స్థానికులు సమాచారం అందించారన్నారు. వెంటనే పోలీస్‌సిబ్బంది వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించి, కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ శాఖను సంప్రదించాలన్నారు.

యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో...



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భువనగిరి టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరి మునిసిపల్ కార్యాలయం ఎదురుగా గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు గల పురుషుడి మృతదేహం రోడ్డు పక్కన పడి ఉంది. మృతుని తల ముందు, వెనుక భాగంలో గాయాలై రక్తస్రావం జరిగింది. అలాగే నడుము, కుడి చెయ్యికి స్వల్పగాయాలున్నాయి. నల్ల రంగు ప్యాంటు, ముదురు ఆకుపచ్చ, నలుపు రంగు టీషర్ట్ శరీరంపై ఉన్నాయని ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు, మృతుడి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ..

చిలుకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిధిలోని కోదాడ-జడ్చర్ల జాతీయరహదారిపై కవిత కళాశాల వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ సురేష్‌రెడ్డి, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ నుంచి చిలుకూరు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని హుజూర్‌నగర్ నుంచి కోదాడ వెళ్తున్న కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మండలంలోని బేతవోలు గ్రామానికి చెందిన మదార్(33)గా గుర్తించారు. బంధువుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని గేదెలు

దేవరకొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లి శివారులో గురువారం ఉదయం కారు ఢీకొన్న ఘటనలో రెండు పాడిగేదెలు మృతి చెందగా మరో రెండు గేదెలకు తీవ్రగాయాలయ్యాయి. దేవరకొండ నుంచి కల్వకుర్తి వెళ్తున్న కారు ఢీకొనడం వల్లే ప్రమాదం జరిగిందని గేదెల యజమాని తూర్పుపల్లి గ్రామానికి చెందిన రైతు నక్క జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

చేనుకు చేవ..రైతుకు రొక్కం

- నానో యూరియాతో మరిన్ని లాభాలు
- పోషకాలతో పంట దిగుబడికి అవకాశం
- తక్కువ ధరతో రైతుకు లాభం
- నానోయూరియా కన్నా ప్లస్‌తో మరింత మేలు



యూరియా కొరతతో రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట చేసిన సమయానికి సరిపడా యూరియా దొరక్క ఉదయం లేచినప్పటి నుంచి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. అయితే యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం కొందరు నానో యూరియాను వినియోగిస్తుండగా దీనికంటే నానో యూరియా ప్లస్ వాడటం వల్ల మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-కోదాడ రూరల్)

నానో యూరియాప్లస్‌లో 20శాతం ఎక్కువ నత్రజని ఉంటుందని దీంతో పంట దిగుబడి, నాణ్యతా పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. పర్యావరణ సమస్యలను కూడా తట్టుకుని నిలబెడుతుందని, పంట ఎదిగే కీలక దశలో దీనిని పిచికారీ చేయాలని సూచిస్తున్నారు. నానో యూరియా ప్లస్ వాడటంతో కిరణజన్య సంయోగక్రియ సామర్థ్యం మెరుగై పంట దిగుబడి సైతం పెరుగుతుందని, ఇది క్లోరోఫిల్ చార్టర్ దిగుబడికి బూస్టర్‌లా పని చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. 500 గ్రామాలు నానో యూరియా ఒక బస్తా యూరియాతో సమానమని చెబుతున్నారు. రైతులు యూరియా బస్తాలు దొరకని సమయంలో ఆందోళన చెందకుండా నానో యూరియా, నానో యూరియా ప్లస్‌లను వాడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

రసాయన యూరియాతో నష్టాలు

సాంప్రదాయ యూరియాతో కొన్ని ప్రతికూలతలు ఉంటాయి. పోషకాల సమతుల్యతకు నీటి కాలుష్యానికి దారి తీస్తాయి. యూరియా నత్రజని వాయువుగా మారి వాతావరణంలోకి విడుదలై పర్యావరణానికి హాని చేస్తుందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రసాయనిక యూరియా అధికవాడకంతో పొటాష్, పాస్ఫరస్ లభ్యతను తగ్గించడంతో పాటు చిన్నమొక్కల ఎదుగుదలకు హాని చేస్తుంది. నత్రజనిని వేగంగా విడుదల చేసే సాంప్రదాయ యూరియా కంటే నానో యూరియా చాలా మంచిదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వానాకాలం సీజన్‌లో సూర్యాపేట జిల్లాలో వరి 4,66,451 ఎకరాల్లో, పత్తి 83,927 ఎకరాలు, పెసర 911, కంది 1232, వేరుశనగ 100 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



సారవంతమైన నేలను కాపాడుకోవడానికి నానోయూరియా వాడకం మంచిది. నానోలో పోషక విలువ సామర్థ్యం ఎక్కువ. నేలకు, పంటలకు మేలు చేస్తాయి. పర్యావరణాన్ని కాపాడేందుకు నానో దోహదపడుతుంది. నానో సాంకేతిక పై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచించాం.

ప్రశాంతి, ఏడీఏ, కోదాడ

నానోతో ప్రయోజనం

- మొక్కలకు పోషకాలు సమర్థంగా అందిస్తుంది.
- అధిక దిగుబడికి అవకాశం.
- పోషక లోపాల సరిచేస్తాయి.
- మెరుగైన ఆహార నాణ్యతకు దోహదం
- మట్టిపై రసాయన భారాన్ని తగ్గించడం
- నానో ఎరువులు నిల్వ చేసుకోవడం, రవాణా చేయడం సులభం.
- నీరు, మట్టిలో కాలుష్యాన్ని తగ్గిస్తుంది.
- మొక్కల ఎదుగుదలకు దోహదం
- అరలీటర్ నానోయూరియా రూ.225, ఇది 45కిలోల యూరియా బస్తాకు సమానం.
- 2-4 మిల్లీమీటర్ల నానో యూరియాను లీటర్ నీటిలో కలిపి ఎకరానికి రెండు సార్లు పిచికారీ చేయొచ్చు.
- నానో యూరియాలో 80-90శాతం పోషకాలు.

గురుకుల సీట్ల కోసం గురుతర బాధ్యత

- గురుకుల సీట్లు సాధించేందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- మంచ్యాతండా ప్రధానోపాధ్యాయుడి విశేష కృషి
- మూడేళ్ల కృషిలో 21 మందికి గురుకులాల్లో విద్యకు అవకాశం

(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)



గురుకులాలకు ఎంపికైన విద్యార్థులతో రాంరెడ్డి(రౌండప్‌లో)

గిరిజన విద్యార్థుల ఉన్నత చదువుకు ఇబ్బందులు రావద్దని అందుకోసం ప్రభుత్వ గురుకులాల్లో సీటు సాధించేందుకు సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మంచ్యాతండా ప్రధానోపాధ్యాయుడు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం నాలుగో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవడంతో ప్రతీ ఏడాది ఈ పాఠశాల నుంచి గురుకులాల్లో విద్యార్థులు సీట్లు పొందుతున్నారు. 2018లో ఈ పాఠశాలలో 10మంది విద్యార్థులతో రెండో తరగతి వరకే నడుస్తున్న పాఠశాలను క్రమంగా తరగతులను పెంచుతూ ఐదో తరగతి వరకు ప్రస్తుతం 65 మందికి చేర్చారు. మూడేళ్లుగా ఇక్కడ చదివిన విద్యార్థుల్లో 21 మంది వివిధ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి సీటు సాధించారు. 2023లో ఆరుగురికి పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా గురుకుల విద్యాలయంలో ప్రవేశానికి ఆయన ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. వీరిలో ఐదుగురు సీట్లు సాధించారు. 2024లో 8 మందికి ఆరుగురు, 2025లో 12 మందికి శిక్షణ ఇవ్వగా 10 మంది గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు సాధించారు. ఏటా మార్చిలో నిర్వహించే గురుకుల పరీక్షకు జూలై నుంచే నాలుగో తరగతి చిన్నారులను సిద్ధం చేస్తుంటారు. ప్రవేశాలకు సంబంధిత పుస్తకాలు కొనివ్వడంతో పాటు ఉదయం, సాయంత్రం అదనంగా ఒక గంట సేపు చదివించి, సందేహాలను నివృత్తి చేస్తారు. ఏడాది పొడవునా వారాంతంలో ఓఎంఆర్ సీట్లపై సమాధానాలు పెట్టడం సాధన చేయిస్తారు. నాలుగో తరగతిలో ఉన్న అందరినీ పరీక్షకు స్వయంగా తీసుకెళతారు.

గురుకులాల్లో సీటుతో పైచదువులకు భారం ఉండదు



మంచ్యాతండా పాఠశాలలో చదివే చిన్నారులు నిరుపేద కుటుంబీకులు. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివిస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని గమనించా. నాల్గో తరగతి చదివే పిల్లలందరికీ ఉదయం, సాయంత్రం గురుకుల ప్రవేశపరీక్షలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నా. పిల్లల బంగారు భవిష్యత్‌కు చదువులు భారం కాకుండా గురుకులాల్లో అర్హత సాధించేలా చేయలన్నదే లక్ష్యంతో పనిచేస్తున్నా. పిల్లలు సీట్లు సాధించడం సంతోషాన్ని ఇస్తోంది.

కొనుగంటి రామిరెడ్డి, హెచ్‌ఎం, మంచ్యాతండా

నిధులు మంజూరు చేయాలి



మంచ్యాతండా ఎంపీపీఎస్ పాఠశాలలో అదనపు గదులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ప్రసుత్తం రెండు గదులు, వరండాలో 60మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. దీంతో సరైన మౌలిక వసతులు, గదులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు అసహనానికి గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ ఏడాది విద్యార్థుల హాజరుశాతం పెరుగుతున్న ఈ పాఠశాలలో అదనపు గదులు, మౌలిక వసతులు కల్పించాలని వేడుకుంటున్నా.

రవినాయక్ మంచ్యాతండా గ్రామస్థుడు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



రోడ్డుకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్

చింతలపాలెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం ఎర్రకుంటతండా నుంచి శోభనాద్రిగూడెం వెళ్లే రోడ్డు మార్గంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో అటుగా వెళ్తున్న స్థానికులు, ప్రయాణికులు, మేత మేయడానికి వెళ్లి వస్తున్న మూగజీవాలు, వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఫ్యూజ్‌బాక్స్ వైర్లు చేతికి అందేవిధంగా ఉందని, నిత్యం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారని గ్రామస్థులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించాలని విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని భయాందోళన చెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దూరంగా కంచెతో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి

తుర్కపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి తక్యుద్దీన్ తెలిపారు. వారి నుంచి 1.460 కిలోల గంజాయి, రవాణా వాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 8న సాయంత్రం ఎస్ఐ తన సిబ్బందితో కలిసి మండలంలోని ముల్కలపల్లి గ్రామపరిధిలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఓ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా బ్రౌన్ టేప్‌తో ఉన్న రెండు కవర్లలో 1.460 కిలోల గంజాయిని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. విచారణలో తుర్కపల్లి మండలంలోని బీల్యానాయక్ తండాకు చెందిన మాడావత్ చరణ్, గుగులోత్ తరణ్‌లు ఒడిషా రాష్ట్రానికి చెందిన కాగేశ్ అనే వ్యక్తి రైలులో గంజాయి తీసుకురాగా అతడి నుంచి హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి స్థానికంగా విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారని ఎస్ఐ తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురువారం తెలిపారు. భువనగిరి జోన్ డీసీపీ అంక్షాశ్ యాదవ్, యాదాద్రి ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, సీఐ పర్యవేక్షణలో గంజాయి విక్రయదారులపై నిఘా పెట్టి పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

పిడుగుపాటుతో మూగజీవాలు మృతి



మల్లారెడ్డిపల్లి శివారులో మృతిచెందిన జీవాలు

చింతపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):పిడుగుపాటుకు 30 గొర్రెలు, మేకలు మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని జరిగింది. వివరాల్లోకి వెళ్తే నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామశివారులో గల ఎర్ర భాగ్య తండాకు చెందిన రత్లావత్ శంకర్ రోజు మాదిరిగానే గొర్రెలతో పాటు మేకల మేపుకుంటున్నారు.సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వాన పడింది. దీంతో పొలం నుంచి గొర్రెలతో పాటు మేకలను తండాకు తరలిస్తున్నాడు. కాగా ప్రమాదవశాత్తు పిడుగు పడటంతో దారిపై వెళ్తున్న 30 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. తనకు ఉన్న గొర్రెలు, మేకలు మృతి చెందడంతో ప్రభుత్వం ఆర్థికసాయాన్ని అందించాలని బాధితుడు వాపోయ్యాడు.

త్రిపురారంలో...

త్రిపురారం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు పాడి గేదె మృతి చెందింగి. ఈ ఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కోమటిగూడెం గ్రామంలో బుధవారం అర్థరాత్రి జరిగింది. బాధిత రైతు గజ్జి అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం ఇంటి ముందు ఉన్న వేప చెట్టుకు పాడిగేదెను కట్టి ఉంచగా బుధవారం రాత్రి పిడుగుపడి పాడి గేదె చనిపోయింది. దీంతో సుమారు రూ.లక్ష నష్టపోయినట్లు రైతు తెలిపాడు. ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు అంజయ్య కోరారు.

సంగెంలో పాడిగేదె...

వలిగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామంలో బుధవారం రాత్రి పిడుగుపాటుకు గురై గేదె మృతి చెందింది. రైతు లింగస్వామికి చెందిన పాడిగేదె మృతితో సుమారు రూ.1.20 లక్షల నష్టం జరిగిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు ..

అడ్డగూడూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందింది. జానకిపురం గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన అంబటి శంబయ్య తన కాడెద్దును మేత కోసం విడిచి పెట్టాడు. గడ్డి మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు సుమారు రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వాపోయాడు.

తండాల్లో గుప్పుమంటున్న గుడుంబా

(ఆంధ్రజ్యోతి-కోదాడ రూరల్)



కోదాడ మండలంలో నాటుసారా తయారీకి ఏర్పాటు చేసిన బట్టీ(ఫైల్)

సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో ఇటీవల నాటుసారా తయారీ పెరిగింది. మండలంలోని బీక్యాతండా, మంగలితండా, కూచిపూడి తండా గ్రామాలలో నాటుసారాను తయారుచేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం నాటుసారా తయారుదారులపై పీడీయాక్టు నమోదుచేస్తామని హెచ్చరించటంతో వారంతా ఇతర వ్యాపారాలను ఎంచుకొని జీవిస్తున్నారు. ఇటీవల కొంతకాలంగా అధికారులు ఉదాసీనంగా ఉండటంతో నాటుసారా తయారీ తిరిగి ప్రారంభమైందని స్థానికులు తెలిపారు. కాగా తయారీ ఇతర ప్రాంతాలకు విస్తరిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. కోదాడ మండలం బీక్యాతండాలోని ఓ వ్యక్తి శ్మశానవాటికలో గుడుంబా కేంద్రం ఏర్పాటుచేసి నాటుసారా విక్రయిస్తుండటంతో పోలీసులు పట్టుకున్నారు. తండాలో సారా తయారుచేస్తే పోలీసులు గుర్తిస్తారనే ఆలోచనతో అనుమానం రాకుండా రహస్య ప్రదేశాలో తయారు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. కోదాడ నియోజకవర్గంలోని పలు తండాల్లో ఇలాంటి స్థావరాలను పట్టుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదు చేస్తేతప్ప దాడులు చేయడంలేదని వారు చెబుతున్నారు. సారాను గ్రామాల్లో తయారు చేసి చుట్టుపక్కల గ్రామాలకు లీటర్ సారా రూ.300 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి సారా సేవించటం కోసం ప్రజలు గ్రామానికి రాత్రి వేళల్లో వస్తున్నారని బీక్యా తండా వాసులు తెలిపారు. మంగలితండాలో ఎక్సైజ్ అధికారులు ముగ్గురు సారా తయారీచేస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం హడావిడి నేపథ్యంలో నాటుసారా తయారీకి తయారీదారులు పెద్దఎత్తున బెల్లం, పటికను నిల్వ చేసుకున్నట్లు తెలిసింది. కూచిపూడి తండాలో కూడా గుడుంబా తయారీ దారులు సారాను తయారు చేసి మేళ్లచెర్వు, మఠంపల్లి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేట ప్రాంతానికి తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నాటుసారా వ్యాపారాన్ని మరింతగా విస్తరించేందుకు ఏజెంట్లను ఏర్పాటుచేసుకుని ఏపీకి సరఫరా చేస్తున్నారు. గత ఏడాదిగా ఈ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి నాటుసారా తయారీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

నాటుసారా తయారీ, విక్రయాలపై ప్రభుత్వ నిషేదం అమల్లో ఉంది. విక్రయించినా కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా తయారుచేస్తే సమాచారం ఇవ్వాలి.

గోవర్థన్, ఎక్సైజ్ ఎస్ఐ, కోదాడ


ఆర్టీసీ ఉద్యోగులు@శాలిగౌరారం

నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో ఏ గ్రామంలో చూసినా ఆర్టీసీ ఉద్యోగులు కనిపిస్తారు. ఓ గ్రామంలో డ్రైవర్లు ఉంటే మరో గ్రామంలో కండక్టర్లు, కంట్రోలర్లు, ఏడీసీ (అసిస్టెంట్ డిపో క్లర్క్)ఉద్యోగులు ఉన్నారు. ఇలా మండలంలో ఏ గ్రామంలోకి వెళ్లినా ఆర్టీసీ ఉద్యోగులు అధిక సంఖ్యలో కనిపిస్తుంటారు. ఇటీవల కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకమైన డ్రైవర్లు మండలం నుంచి ఎక్కువ మందే ఉన్నారు. మండలంలోని వల్లా ల గ్రామంలో 60 మందిలో ఎక్కువగా కండక్టర్లు, స పర్‌వైజర్లు ఉన్నారు. పెర్కకొండారంలో 95 మందిలో ఎక్కువగా డ్రైవర్లు ఉన్నారు. అడ్లూర్‌లో 30 మంది, ఆకారంలో 20 మంది ఆర్టీసీలో ఉద్యోగం చేస్తున్నారు. ఇలా ప్రతీ గ్రామంలో 10 మంది వరకు ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు.

- (ఆంధ్రజ్యోతి-శాలిగౌరారం)

» ఒకే మండలంలో 400 మంది ఉద్యోగులు

» ప్రతి గ్రామంలో దాదాపుగా 10 మంది సిబ్బంది



బస్సు నడుపుతున్న ఆర్టీసీ డ్రైవర్ రమేష్

ప్రతి ఏడాది ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ, సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడ, దేవరకొండ, యాదగిరిగుట్ట, నార్కట్‌పల్లి డిపోలతో పాటు హైదరాబాద్‌లోని పలు డిపోల్లో డ్రైవర్లుగా, కండక్టర్లు సూపర్ వైజర్లుగా ఉన్నతాధికారులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వల్లాలలోని ఆర్టీసీ ఉద్యో గులంతా వివిధ ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తూ ఒక యూ నిట్‌గా ఏర్పడి గ్రామం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. వల్లాలలో ఆర్టీసీ ఉద్యోగు ల సేవా కార్యక్రమాలు చేపడుతారు. వీరు ప్రతీ సంవత్సరం ఆగస్టు 15న గ్రామంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుం టారు. గ్రామంలో బడి, గుడి నిర్మాణాల్లో పాలు పంచుకుంటూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామస్థుల మన్ననలను పొందుతు న్నారు. విద్యార్థుల చదువులో ప్రోత్సహించడానికి అవార్డులు, నగదు పారితోషికం అందిస్తున్నారు. ప్రతీ సంవత్సరం ఎస్ఎస్‌సీలో ర్యాంకులు సాధించిన వారికి నగదు పారితోషికాలు, బహుమతులు అంద జేస్తున్నారు. మండలంలోని పెర్కకొండారం గ్రామంలో ఆర్టీసీ ఉద్యోగులు ఆర్టీసీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ 90 మంది వరకు ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు. అందులో ఎక్కువ డ్రైవ ర్లు ఉన్నారు. 30 మందికి పైగా రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యో గులు ఉన్నారు. వీరికి ప్రతి ఏడాది ఆర్టీసీ ఉద్యోగు లు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసి సన్మానిస్తారు.

నిబద్ధతతో పనిచేస్తా



1988లో కండక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీక రించా. మొదట యాదగిరి గుట్ట డిపోలో కండక్టర్‌గా, దేవ రకొండ డిపోలో, నల్లగొండ ఆర్ఎం ఆఫీస్‌లో, మియాపూర్ బస్ బాడీలో జూనియర్ అసిస్టెం ట్‌గా,హైదరాబాద్ బస్ భవన్‌లో 15 ఏళ్లు సూప ర్‌వైజర్‌గా, ప్రస్తుతం పర్సనల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. ఏ పని అయినా నిబ ద్ధతతో పనిచేస్తాను.

- సముద్రాల జగన్మోహనాచార్యులు, వల్లాల (పర్సనల్ ఆఫీసర్, ఆర్టీసీ ఎండీ కార్యాలయం హైదరాబాద్)

ఆర్థిక పరిస్థితుల రీత్యా ఆర్టీసీలో చేరా



కష్టపడి చదివి పెద్ద ఆఫీ సర్‌ను అవ్వాలని ఇంటర్‌లో ఎంపీసీ గ్రూపులో కాంపో జిట్ మ్యాథమెటిక్స్ తీసు కున్నా. ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్‌లో ఉన్నప్పుడు ఆర్టీసీలో ఉద్యోగాలు పడ్డాయి. ఏదో ఒక ఉద్యోగంతో కుటుంబాన్ని పోషించుకోవడానికి సూర్యాపేట డిపో లో 1989లో కండక్టర్ గా బాధ్యతలు చేపట్టా. నెల రోజులు యాదగిరిగుట్ట డిపోలో పనిచేసి తిరిగి సూర్యాపేట డిపోలో ఏడీసీగా పనిచేస్తున్నాను. మా అడ్లూర్ గ్రామం నుంచి ఆర్టీసీలో 30 మంది పనిచేస్తున్నారు.

- భాస్కర్, అడ్లూర్, ఏడీసీ సూర్యాపేట డిపో


ప్రయాణికులకు సేవలందించడం తృప్తి గా ఉంది



డిగ్రీ వరకు చదివాను. 2010లో సూర్యాపే టలో కండక్టర్ ఉద్యోగం వచ్చింది. 2013లో రెగ్యులర్ అ య్యింది. నార్కట్‌పల్లి డిపోలో కండక్టర్‌గా చేస్తున్న సమయంలో హైదరాబాద్ లోని బస్ భవన్‌కు ఓడీ ద్వారా ఐటీ డిపార్టమెం ట్‌లో విధులు నిర్వర్తిస్తున్నా. ఆర్టీసీ ద్వారా ప్రజలకు సేవలు అందించడం సంతృప్తిగా ఉంది.

- తుమ్మలపల్లి అనిల్ కుమార్, ఊట్కూరు, ఐటీ డిపార్ట్‌మెంట్, బస్ భవన్, హైదరాబాద్

ప్రమాదరహితంగా డ్రైవింగ్ చేస్తున్నాం



1997 నుంచి డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. మొదట సూర్యాపేట తరువాత కోదాడ, నార్కట్‌పల్లి, మిర్యాలగూడ డిపోలో పనిచేశా. ప్రస్తుతం సూర్యాపేట డిపోలో విధులు నిర్వర్తిస్తున్నాను. ఇంతవరకు డ్రైవింగ్‌లో ఒక్క యాక్సిడెంట్ కూడా జరగలేదు. ప్రయాణికుల క్షేమంగా తీసుకవెళ్లడమే కర్తవ్యంగా భావిస్తాను. మా గ్రామంలో 90 మంది వరకు ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు. అందులో డ్రైవర్లే ఎక్కువగా ఉన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసుకొని రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులను ప్రతీ సంవత్సరం సన్మానిస్తాం

-పాశం విప్లవరెడ్డి, పెర్కకొండారం, డ్రైవర్ సూర్యాపేట

డిగ్రీ సెకండ్ ఇయర్‌లో ఉద్యోగం వచ్చింది



డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతు న్నప్పుడు కండక్టర్ ఉద్యోగం వ చ్చింది. మొదట నార్కట్‌పల్లిలో తరువాత రంగారెడ్డి జిల్లా తాం డూర్‌లో కొద్దికాలం పనిచేసి 1991 లో నల్లగొండకు బదిలీ అయ్యాను. 2008లో ఇదే డిపోలో సీఆర్‌సీగా చేశాను. ప్రస్తుతం ఏడీసీగా నల్లగొండలో పనిచేస్తున్నాను.

-చిట్టిపోలురమేష్, వల్లాల, ఏడీసీ నల్లగొండ డిపో

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రాకార మండపంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతిదిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు మంగళవాయిద్యాల నడుమ సేవో త్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విష్వక్సే నుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తు లకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅ మ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజా నాకు వివిధ విభాగాల ద్వారా రూ. 12,27,820 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జీ ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు.

వరిలో నూతన పద్ధతులపై రైతులకు అవగాహన



వరి పైరును పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల ంలోని లింగాల గ్రామంలో డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగు చేసిన వరిని కేవీకే శాస్త్రవే త్తలు కిరణ్, సాయి కిరణ్, అజయ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...చీడ పీడల నుంచి పంటను ఎలా రక్షించుకోవాలి, కలుపు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు వారు అవగాహన కల్పించారు. కార్య క్రమంలో రైతులు బత్తిని అంజ య్య, మామిడి రాంబాబు, రామయ్య పాల్గొన్నార ు.

సాగర్ 4 గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారులు 4 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడు గులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 590 అడుగులుగా (312.0450టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 10,040 క్యూసెక్కుల నీటిని, ఎడమకాల్వ ద్వారా 7272 క్యూసె క్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,779 క్యూసెక్కులు, 26 క్రస్ట్‌గేట్లల్లో 4 గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 32,400 క్యూసె క్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 83,491 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి అంతే మొత్తంలో వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి వరద కాల్వ, ఎస్ఎల్‌బీసీకి నీటి విడుదల నిలిపివేశారు.

మూసీకి కొనసాగుతున్న వరద

కేతేపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. మూసీ పరీవాహక ప్రాం తాల్లో రోజుల తరబడి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు దిగువన గల మూసీ రిజర్వాయర్‌లో వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ క్ర మంలో బుధవారం సాయంత్రానికి 3649.25క్యూసెక్కులుగా ఉన్న ఇన్ ఫ్లో గురువారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగి 4,842. 45 క్యూసెక్కులుగా నమోదయ్యింది. మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 644.60 అడుగులు(4.36టీఎంసీలు)ల గరిష్ఠ స్థాయికి చేరడంతో అధికారులు ఎగువ నుంచి వస్తున్న వరదకు అనుగుణంగా ప్రా జెక్టు 3,4,8,10 నంబరు క్రస్ట్ గేట్లను అడుగు మేర ఎత్తి 2,65 6.32 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే ప్రా జెక్టు కుడి,ఎడమ కాల్వల ఆయకట్టుకు విడుదలవుతున్న మరో 342.72 క్యూసెక్కుల నీటిని కలుపుకుని ప్రాజెక్టు నుంచి మొత్తం 3,047.66 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645అడుగు లు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టుప్రస్తుత నీటిమట్టం 644.60అడుగులు(4.36టీఎంసీలు)గా ఉంది.

రైతులకు యూరియా తిప్పలు



మఠంపల్లి పీఏసీఎస్ వద్ద యూరియా కోసం గుమిగూడిన రైతులు

మఠంపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల రైతులకు యూరియా కష్టాలు తొలగడం లేదు. యూరియా కోసం గంటల తరబడి నిరీక్షించినా దొరకని పరిస్థితి నెలకొంది. మఠంపల్లి పీఏసీఎస్‌కు బుధవారం రాత్రి యూ రియా లోడ్ వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు పరిసర గ్రామాల నుంచి దాదాపుగా 600 మందికి పైగా రైతులు తెల్ల వారు జాము నుంచి పీఏసీఎస్ వద్ద బారులు తీరారు. మధ్యాహ్నం వరకు క్యూలైన్‌లో నిలబడినా కొద్దిమందికే లభించింది. కాగా గురువారం ఉదయం పీఏసీఎస్, మన గ్రోమోర్ కార్యాలయాలకు యూరియా లోడ్ వచ్చినా రైతులందరికీ యూరియా అందక పోవడంతో గురువారం కార్యాలయాల వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లా డుతూ రోజూ యూరియా కోసం వస్తున్నా తమకు కట్ట యూరియా దొరకడం లేదని, పైరవీకారులకే దొరుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో పలు చోట్ల బ్లాక్ మార్కెట్‌లో యూరియాను విక్ర యిస్తున్నారని, అధికారులు రైతులకు సక్రమంగా అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. వానాకాలం పంట కాలం ముగియ వచ్చినప్పటికీ రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేద న్నారు. అధికారులు స్పందించి మండలంలో యూరియా కష్టాలను నివా రించాలని కోరుతున్నారు.

జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



నవదీప్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల విద్యార్థి పల్లపు నవదీప్(10వ తరగతి) జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కేకే.జయరాజన్ మాట్లాడుతూ పట్టణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడి యంలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో తమ విద్యార్థి నవదీప్ ఉత్తమ ప్రతిభ కన బర్చి డిస్ట్రిక్ట్ లెవల్‌కు ఎంపిక కావడం ఆదర్శనీయమన్నారు. జిల్లా స్థాయిలోనూ రాణించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని, పట్టణానికి గుర్తింపు తేవాలని ఆకాంక్షిం చారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అనం తరం ఉపాధ్యాయుల సమక్షంలో నవదీప్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠ శాల డైరెక్టర్ జీసీ జయరాజన్, హెచ్ఎం. సుజయ్‌కుమార్, పీఈటీలు రమేష్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకపఠనంతో నైతిక విలువల పెంపు



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న రచయిత, ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి

నల్లగొండ రూరల్/ నల్లగొండ కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కథల పుస్తకాలు చదవడం వల్ల నైతిక విలువలు పెంపొందిచడమే కాకుండా పఠనాభివృద్ధి పెరుగుతుందన్నాని రచయిత, ఉపాధ్యా యుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి అన్నారు. నల్ల గొండ పట్టణ పరిధిలోని మర్రిగూడ ప్రాథ మిక పాఠశాల, ఉన్నత పాఠశాలలకు రచ యిత, ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి తాను రాసిన మొలకలు, బంతిపూలు బహు మతి, ఊగుతున్న ఉయ్యాల వంటి కథలు గేయాల పుస్తకాలతో పాటు అనేక బాల సాహిత్య పుస్తకాలను ఉచితంగా విద్యార్థులకు గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృ ద్ధికి ఈ పుస్తకాలు ఎంతగానో దోహదపడ తాయని అన్నారు.

భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదిగేం దుకు కథలు చదివే అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల భాస్కర్ మాట్లాడుతూ పాఠశాలకు వచ్చి గ్రంథాలయ పుస్తకాలు అందజేయ డం అభి నందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయు రాలు సుప్రియ, సురేందర్, శ్రీనివాస చారి, జ్యోతి, కోమటిరెడ్డి అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వైష్ణవి ఎంపిక



కనగల్, అక్టోబరు 9: (ఆంధ్రజ్యోతి): కనగల్ ఎస్ ఏవీఎం మోడల్ స్కూల్/జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ సెకండియర్ బైపీసీ విద్యార్థి ఆవుల వైష్ణవి ఈనెల 10, 11, 12 తేదీల్లో మహబూబాబాద్ నర్సంపేటలో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్ 19 ఎస్‌జీఎఫ్ బాలికల కబడ్డీ పోటీలకు ఎంపికైంది. వైష్ణవి ఈనెల 8న భువనగిరిలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా కబడ్డీ పోటీల్లో అత్యు త్తమ ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపి కైందని పాఠశాల ప్రిన్సిపాల్ థామసయ్య గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన వైష్ణవిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వడ్ల కల్లంగా హెలిప్యాడ్



బీ.వెల్లెంల రిజర్వాయర్ వద్ద ఉన్న హెలిప్యాడ్‌పై ధాన్యం కుప్పలు

నార్కట్‌పల్లి, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వరికోతలు మొదలయ్యాయి. ప్రభుత్వం కూడా ధాన్యం కొనుగోలు కేంద్రా లను ఏర్పాటు చేస్తోంది. దీంతో ప్రతీ సీజన్ మాదిరిగానే ఈ పర్యాయం కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు తమ పొలాల్లో కోసిన ధాన్యాన్ని తెచ్చి కుప్పలు పోస్తున్నారు. కొందరైతే ధాన్యంలో తేమ ఉంటే ఆరబెట్ట డానికి రోడ్లను కూడా ఆక్రమించి ధాన్యాన్ని ఆరబెట్టుకోవడం చూస్తున్నాం.. ఓ రైతు హెలిప్యాడ్‌ను వడ్ల కల్లంగా మార్చుకు న్నాడు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల రిజర్వాయర్ కట్ట కింద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌పై ఓ రైతు ధాన్యం కుప్పలను పోశాడు.

లక్కీడ్రాలో రూ.101కి రూ.10లక్షల ప్లాట్



రాజుకు ప్లాట్ రిజిస్ట్రేషన్ దస్తావేజు అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): లక్కీ డ్రా విజే తకు ప్లాట్ దక్కింది. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం గౌసుకొండ గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రూ.101కి కూపన్లు కొనుగోలు చేశారు. ఈనెల 3వ తేదీన లక్కీ డ్రా తీశారు. ప్రథమ బహుమతి విజేత చిట్యాల మండలం వెలి మినేడు గ్రామానికి చెందిన రూపాని రాజుకు గురువారం చినకాపర్తి గ్రామంలో 150 గజాల ప్లాటు(సుమారు రూ.10లక్షల విలువ) రిజిస్ట్రే షన్ చేసి నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా విజేత రూపాని రాజు మాట్లాడుతూ గౌసుకొండ గ్రామానికి చెందిన శివరామ దుర్గా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గూడూరు ప్రమోద్‌రెడ్డి, వెదిరె రాజిరెడ్డి, మర్రి నితిన్‌రెడ్డి, కళ్లెం రవీం దర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు బ్రేక్

(3వ పేజీ తరువాయి)

మేరకు ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్ల కేటాయింపులుంటా యని, ఆరువారాల తర్వాతే ఏ నిర్ణయమైనా వెలువడుతుందని పేర్కొంటున్నారు

ఆశావాహుల్లో నిరాశ

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు అన్ని విధాలా ఏర్పాట్లు చేసుకున్న ఆశావాహులు హైకోర్టు నిర్ణయంతో ఒక్కసా రిగా నిరుత్సాహం చెందారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేసేందుకు ఆయా పార్టీల ముఖ్యనేతల అనుచరులు, నాయకులు సిద్ధమవగా వారి ఆశలన్నీ నీరుగారాయి. ఆరువారాల తర్వాత నైనా మళ్లీ ఇదే రిజర్వేషన్లుంటాయో..? లేక రిజర్వేషన్లు మారుతా యోననే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎన్నికల ప్రక్రియ మొదలైన మొదటిరోజే స్టే ఇవ్వడంతో కొంతమేర మంచి పరిణా మమేనని, అదే మరికొంత కాలం గడిచాక ఎన్నికలు ఆపేసినా, లేక ఎన్నికలు జరిగాక, కొట్టివేసినా అశావహులు తీవ్రంగా నష్టపో వాల్సి వచ్చేదని అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా ఎన్నికల ప్రక్రియకు బ్రేక్‌పడడంతో తదుపరి పరిణామాలు ఎలా ఉండబో తాయనే అంశంపైనే అందరిలో ఆసక్తి కొనసాగుతోంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

● సీపీఎం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

నల్లగొండ రూరల్, అక్టోబరు 9 (ఆంధ్ర జ్యోతి) : ప్రజా సమస్యలపై నిరంతరం సీపీఎం పోరాటం చేస్తోందని ఆ పార్టీ సీపీఎం జిల్లా కార్యాదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శుల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఎన్ని కలు ఎప్పుడు వచ్చినా జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులు అన్ని స్థానాల్లోనూ సీపీఎం పోటీ చేస్తుందని తెలిపారు. నల్ల గొండ జిల్లాలో పేద, మధ్యతరగతి ప్రజల, కార్మిక, రైతు, రైతు కూలీల, మహిళల, విద్యా ర్థుల అనేక సమస్యలపై నిరంతరం పోరా టాలు చేసి, సమస్యలను పరిష్కరించే వరకు వారికి అండగా నిలిచిన ఘనత సీపీఎందే అని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారి ఐలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సయ్యద్ హాషం, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వసతిగృహాలను సందర్శించిన ప్రత్యేకాధికారి

మర్రిగూడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ, కస్తూర్బాగాంధీ బాలికల వసతిగృహాలను మండల ప్రత్యేక అధికారి వేణుగోపాలచారి గురువారం సందర్శించారు. మౌలిక సదుపాయాలపై ఆరాదీశారు. హాస్టళ్లలో సమస్యలను ప్రిన్సిపాల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆదర్శ పాఠశాలలో వంట గదుల కొరత, వసతి గృహంలో వాటర్ ప్లాంట్ ఇబ్బంది ఉన్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో మున్నయ్య, ఎంఈవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జ్యోతి, వెంకట్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సీనియర్ సిటిజన్ వెల్‌నెస్ కార్యక్రమం

కట్టంగూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరులో గురువారం పాత గ్రామపంచాయతీ దగ్గర లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూరు కింగ్స్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ వెల్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు రెడ్డిపల్లి సాగర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వృద్ధులను ఆదరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, కోశాధికారి పోగుల రాములు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సభ్యులు మల్లికార్జున్, వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వర్షానికి రైతన్న కుదేలు

ఐకేపీ కేంద్రాల్లో కొట్టుకుపోయిన ధాన్యం, నేలకు ఒరిగిన వరి, పత్తి రైతుల ఇక్కట్లు

కట్టంగూరు, శాలిగౌరారం, తిప్పర్తి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు మండలంలో గురువారం రాత్రి సుమారు గంటకు పైగా మండలంలోని వివిధ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా మండలంలోని కట్టంగూరు, అయిటిపాముల ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం రాశులు తడవడంతో పాటు కొట్టుకుపోయాయి. అయిటిపాముల ధాన్యం కొనుగోలు కేంద్రంలో ముందస్తుగా రైతులు పోసుకున్న ధాన్యం తడిపి ముద్దయింది. బత్తుల నరేందర్‌రెడ్డి, కన్నెబోయిన అయిలయ్య, బెల్లి సుధాకర్, మామిడి చంద్రు అనే రైతులతో పాటు మరికొంత మంది రైతుల ధాన్యం భారీ వర్షంలో కొట్టుకుపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షంలో కొట్టుకుపోయిన ధాన్యానికి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని అయిటిపాముల మాజీ ఎంపీటీసీ బెల్లి సుధాకర్ ప్రభుత్వాన్ని కోరారు.



అయిటిపాములలో కొట్టుకుపోయిన ధాన్యం

శాలిగౌరారంలో నేలకొరిగిన వరి చేలు

శాలిగౌరారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం రాత్రి వీచిన భారీ ఈదురుగాలులకు, వర్షానికి చేతికొచ్చిన వరి చేలు నేలపాలయ్యాయి. వందల ఎకరాల్లో వరి పంట నేలకొరగడంతో రైతులు ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు పర్యవేక్షించి తమ పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి నష్ట పరిహారం అందజేయాలని కోరారు.

తిప్పర్తి మండలంలో అకస్మాత్తుగా కురిసిన వర్షాలకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఆరు మాసాలు కష్టపడిన పంట తీరా చేతికి వచ్చే ముందు కురిసిన భారీ వర్షానికి పూర్తిగా నేలను తాకాయి. వరిధాన్యంతో తడిసిన వరిపొలాలు బరువు ఆపలేక, వర్షం పడిన ధాటికి తట్టుకోలేక ధాన్యం రాలి పంట పొలాల్లోనే రాలిపోతుంది. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మండల వ్యాప్తంగా వేల ఎకరాలు నేలపై పడిపోయాయి. తమ పంటలపై ఆశలు పెట్టుకున్న రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.



కేతేపల్లి మండలం అయిటిపాములలో తడిసిన ధ్యాన్యాన్ని చూపుతున్న రైతులు



శాలిగౌరారంలో నేలకు ఒరిగిన వరి పైరును చూపిస్తున్న రైతు నిమ్మల శంకర్

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

కేతేపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. కేతేపల్లి మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన భవిష్య కాలేజీ చైర్మన్, విద్యావేత్త రాచకొండ జానయ్య హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మాజీ ఎంపీ సమక్షంలో గురువారం బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన ఆయనకు నర్సయ్యగౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుతో గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పిట్ల వెంకట్, నాయకులు జి.శ్రీనివాస్, ఆర్.గోపి, సీహెచ్.శేషయ్య, ఆర్.శ్రీనివాస్‌గౌడ్, జి.వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీ గో బ్యాక్ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా సుదర్శన్



కురపాటి సుదర్శన్

చండూరురూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మార్వాడీ గో బ్యాక్ ఉద్యమ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన కురుపాటి సుదర్శన్‌ను నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం మార్వాడీ గో బ్యాక్ ఉద్యమకర్త పిడమర్తి రవి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న తనని గుర్తించి మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షునిగా అదే విధంగా ప్రస్తుతం మార్వాడీ గో బ్యాక్ ఉద్యమానికి రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమించినందుకు పిడమర్తి రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మార్వాడీ గో బ్యాక్ ఉద్యమంలో తన వంతుగా క్రియాశీల పాత్ర పోషిస్తానని ఆయన తెలిపారు.

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి



ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న తహసీల్దార్ వరప్రసాద్

శాలిగౌరారం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బిట్ల వరప్రసాద్ కోరారు. శాలిగౌరారం సింగిల్‌విండో ద్వారా ఏర్పాటు చేసిన ఏఎంసీ శాలిగౌరారం, తిరుమలరాయినిగూడెం, ఊట్కూరు, అడ్లూర్, మాదారం కలాన్, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ వరప్రసాద్ ప్రారంభించారు. ధాన్యం పూర్తిగా ఎండిన తర్వాత కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో ఏవో సౌమ్య శృతి, మానిటరింగ్ ఆఫీసర్ నాగేశ్వర్, సింగిల్ విండో సీఈవో నిమ్మల ఆంజనేయులు, మార్కెట్ సెక్రట రీ చీనానాయక్, ఆర్ఐ అజారుద్దీన్, రఫీ, ఏఈవోలు శ్రావణ్ కుమార్‌రెడ్డి, ఝా స్సీ సిబ్బంది పద్మ, శంకర్, నరేష్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు వెంకటరమణారెడ్డి

మర్రిగూడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు పత్తి విక్రయించడానికి అధికారులు వెంటనే పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు రామిడి వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. మర్రిగూడలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షాల వల్ల చేతికొచ్చిన పత్తి పంటకు తెగుళ్ల సోకి రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్ర భుత్వం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేకపోవడం వల్ల రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇదే అదనుగా పత్తి తడిసి ఎర్ర బారిందని దళారులు మోసం చేస్తూ దండుకుంటున్నారన్నారు.

పత్తి పంటలు చేతికి వచ్చే సమయంలోనే అకాల వర్షాలు వల్ల పంటలు దెబ్బతిన్నాయని పెట్టిన పెట్టుబడులు కూడా రాక నష్టపద్దారని, అధికారులు స్పందించి పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పత్తి విక్రయాలను చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా బీఆర్ఎస్ ప్రచార కార్యదర్శి కొలుకులపల్లి యాదయ్య, రమేష్, రవి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య - బాకీ కార్డుల పంపిణీ



శాలిగౌరారంలో బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్

శాలిగౌరారం, నకిరేకల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి బాకీ కార్డులను మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాయ చేస్తుందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తిరగబడాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 22 నెలల్లో ఇప్పటి వరకు ఒక్కో వ్యక్తికి ఎంత బాకీ పడిందో తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుల ఓట్ల కోసంమీ వద్దకు వచ్చినప్పుడు వాళ్ల ఇచ్చిన హామీలు గురించి ప్రశించాలని, బాకీ కార్డులు చూపించి ఎండగట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఐతగోని వెంకన్న గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి చాడ హరీష్ రెడ్డి, మాజీ అధ్యక్షులు కట్టా వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు మామిడి సర్వయ్య, గుండా శ్రీనివాస్, గుజిలాల్ శేఖర్ బాబు, దుబ్బ వెంకన్న, మాచర్ల అంజయ్య, నిమ్మల సురేష్, గోదల సురేష్ రెడ్డి, దాసరి వెంకన్న, సకినాల నర్సయ్య, పాక చిన రాములు, మాగి రవి, తీగల వెంకన్న, బంటు అవిలయ్య, గోపి, రాగి దావీద్, ముత్యాల వెంకన్న, కమలాకర్, రమేష్, వీరసోములు పాల్గొన్నారు.



నకిరేకల్‌లో కార్డులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

కాగితాలకే పరిమితమైన ప్రభుత్వ హామీలు

నకిరేకల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గస్థాయి స్థానిక సంస్థల ఎన్నికల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అభివృద్ధిలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ బాకీలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఎప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలన్నారు. జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసేంత వరకు బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందన్నారు. కేటీఆర్ విడుదల చేసిన కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి చేరవేసి ప్రభుత్వ వైఫల్యాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో మార్కెట్ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తరాల బలరాం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు సందినేని వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్, రాములు, ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, అయిలయ్య, మల్లేశం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ సర్పంచ్

కేతేపల్లి: మండలంలోని చీకటిగూడెం గ్రామానికి చెందిన పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. నకిరేకల్‌లో నిర్వహించిన సమావేశంలో కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామ మాజీ సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు.

పార్టీలో చేరిన వారికి నకిరేకల్ ఏఎంసీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎం.వెంకట్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణగౌడ్, చింతం రాజు, కోట సంపత్‌రావు, ఎస్.నాగేశ్వరరావు, పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రదీప్‌రెడ్డి

బీసీలను అపహాస్యం చేసిన ప్రభుత్వం

● మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం

గట్టుప్పల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నవ్వుల పాలు చేసిందని మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం అన్నారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో నెం. 9పై హైకోర్టు స్టే విధించిందంటే, ఈ జీవో తప్పుల తడకగా ఉందని, కేవలం కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం, రాహుల్‌గాంధీ మెప్పు కోసమే మాత్రమే ప్రయత్నం చేసినట్లు విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం బీసీలకు రిజర్వేషన్ల కోసం ప్రయత్నం చేసినట్లు క్రియేట్ చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం ఇవ్వాలని ఉంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా 9వ షెడ్యూలులో పొందుపరచి రాష్ట్రంలోని బీసీలకు న్యాయం చేయాలని, చట్టబద్ధత కల్పించినప్పుడే కాంగ్రెస్ పార్టీకి మనుగడ ఉంటుందని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చిలుకూరి అంజయ్య, పున్న కిషోర్, కర్నాటి వెంకటేశం, నారని జగన్, నెలంటి వెంకటేశం, చెరుపల్లి నగేష్, దోర్నాల బాలకృష్ణ పాల్గొన్నారు.

కల్లు గీత కార్మికసంఘం మండల అధ్యక్షుడిగా అంజయ్య



కొప్పుల అంజయ్య



బుచ్చిరాములు

నకిరేకల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం నకిరేకల్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎరుకలి అంజయ్య, అధ్యక్షుడు కొప్పుల అంజయ్య, కార్యదర్శి గుడుగుంట్ల బుచ్చిరాములు, ఉపాధ్యక్షులు పొడిచేటి వీరయ్య, చెవుగోని ప్రభాకర్, సహాయ కార్యదర్శులుగా కొప్పుల వెంకటేశ్వర్లు, పుట్ట జానయ్య, మాద వెంకట్, సభ్యులు భూపతి వెంకన్న, అయితగోని లింగయ్య, కారింగుల యాదయ్య ఎన్నికయ్యారు.

ఊరూరా ప్రభుత్వాన్ని నిలదీయాలి : బీఆర్ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న బచ్చు రామకృష్ణ

మర్రిగూడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం వాటా ఇస్తానని నయవంచన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఊరూరా నిలదీయాలని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు బచ్చు రామకృష్ణ అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చట్ట విరుద్ధమని, ఇది న్యాయస్థానంలో నిలబడదని, రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసినా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 42శాతం రిజర్వేషన్ అమలుపై ప్రభుత్వానికి కోర్టులో చుక్కెదురు కావడంతో టీఆర్ఎస్ పార్టీపై బురద జల్లడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం బీఆర్ఎస్‌పై చేస్తున్న ఆరోపణలు చేతగానితనానికి పరాకాష్ట అన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును గమనిస్తున్నారని తెలిపారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు చెరుకు శ్రీరాములు, గంట రవి, మనోహర్, వెంకట్ రామ్, సత్తయ్య, రాపోలు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



గంధం ఊరేగింపులో పాల్గొన్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లోని చారిత్రాత్మకమైన హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి ఉర్సులో గంధం ఊరేగింపులో పాల్గొన్న మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి తదితర నాయకులు



పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● సీడీపీవోలు లావణ్య కుమారి, అస్రా అంజుం




గట్టుప్పల: విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న సీడీపీవో లావణ్యకుమారి

గట్టుప్పల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, మహిళలు, ఆడపిల్లలకు, చిన్నపిల్లలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ మునుగోడు, నకిరేకల్ సీడీపీవోలు లావణ్య కుమారి, అస్ర అంజుం అన్నారు. గట్టుప్పల మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్, శాలిగౌరారం మండలం పొలాల గ్రామాల్లో పోషణ మాసం సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పా ల్గొని మాట్లాడారు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ పాటించాలని, పౌష్టికరమైన ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అదే విధంగా వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పిండి వంటకాలు, పండ్లు, కూరగాయలను ప్రదర్శించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారంపై పోటీ పరీక్ష నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతు లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ, హెచ్ఎం అమృత, అంగన్‌వాడీ టీచర్లు జయలక్ష్మి, సృజన, మంజుల, పొలాలలో నిర్వహించిన సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు శ్యామ లక్ష్మి, శోభరాణి, సైదమ్మ, కార్యదర్శి కృష్ణ, ఆశా వర్కర్లు భవాని తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి గ్రా మంలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ యశోద మాట్లాడారు. చిరుధా న్యాల ప్రాముఖ్యత, పోషక విలువలు కలిగిన ఆహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వాసు దేవరావ్, అంగన్‌వాడీ టీచర్ రజిత, ఆయా, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
నల్లగొండ
3
శుక్రవారం 10 అక్టోబరు 2025
గరిష్ఠం 29.5
కనిష్ఠం 23.4



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	83,491	83,491
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.60 (4.36)	4842..45	3047.66
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.144 (41.4373)	66,230	37,423

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



స్థానిక ఎన్నికలకు బ్రేక్

స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్‌పడింది. తొలివిడతలో జరగాల్సిన పరిషత్ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ సైతం విడుదలైనా సాయంత్రానికి హైకోర్టు స్టే విధించడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచినట్లయింది. ఎన్నికల నామినేషన్ల ఘట్టం మొదలైన కొద్దిగంటల్లోనే ప్రక్రియ నిలిచిపోవడంతో ఆశావహుల్లో నైరాశ్యం నెలకొంది. అయితే కోర్టు స్టే విధించడంతో పాత రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలకు వెళ్లే ఛాన్స్‌పై అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- బీసీ రిజర్వేషన్లు, ఎన్నికల నిర్వహణపై ఆరువారాలు స్టే విధించిన హైకోర్టు
- నిరుత్సాహంలో ఆశావహులు

ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన హైకోర్టు తీర్పు రానే వచ్చింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని, ఈ రిజర్వేషన్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.9ను కొట్టివేయాలని హైకోర్టులో దాఖలైన పిటిషన్‌ను విచారణ చేపట్టిన ప్రత్యేక ధర్మాసనం గురువారం సాయంత్రం జీవో అమలును నాలుగువారాలపాటు నిలిపివేయాలని, అదేవిధంగా ఎన్నికల ప్రక్రియను సైతం ఆరు వారాలపాటు నిలిపివేస్తూ స్టే ఇచ్చింది. పరిషత్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం మొదలైన కొద్దిగంటల్లోనే ప్రక్రియ నిలిచిపోవడంతో రాజకీయపార్టీల నేతల్లో ప్రధానంగా కాంగ్రెస్ నాయకులు, స్థానిక ఎన్నికల్లో పోటీచేసేందుకు సిద్ధమయిన ఆశావహుల్లో నిరుత్సాహం నెలకొంది.

పాతరిజర్వేషన్ల ప్రకారం వెళ్లే ఛాన్స్



బీసీలకు 42శాతం రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలగా ఉన్నప్పటికీ హైకోర్టు ముందు జీవో నిలబడకపోతే తదుపరి ఏం చేస్తారనే అంశంలో భిన్న అంశాలు తెరమీదకు వస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలను తప్పకుండా నిర్వహించాల్సిన పరిస్థితి ఒకవైపు నెలకొంటే, మరోవైపు బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉండడంతో అధికార కాంగ్రెస్ ఎలాంటి నిర్ణయంతో ముందుకెళుతుందనే అంశం తేలాల్సి ఉంది. అయితే హైకోర్టులో ఆరువారాల తర్వాత వచ్చే తీర్పు బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా ఉంటే ఎలాంటి ఇబ్బంది లేకుండా తాజాగా ప్రకటించిన రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళతారని భావిస్తున్నారు. 42శాతం రిజర్వేషన్ల జీవోను హైకోర్టు కొట్టివేస్తే మాత్రం 2018లో అమలు చేసిన రిజర్వేషన్ల కోటా ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ముఖ్యులు ప్రభుత్వానికి సూచిస్తున్నట్లు చర్చ సాగుతోంది. అధికారికంగా బీసీలకు 23శాతం రిజర్వేషన్ ఇస్తూ, పార్టీపరంగా 42శాతం బీసీ అభ్యర్థులను బరిలో ఉంచి పార్టీ పరంగా రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అయితే రిజర్వేషన్లను ప్రస్తుతం ప్రకటించిన మేరకు ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు అలాగే కొనసాగిస్తారా?..? లేక అన్ని కేటగిరీల రిజర్వేషన్లను మళ్లీ కేటాయించి ప్రకటిస్తారా?? అనే విషయం తేలాల్సి ఉంది. మొత్తంగా ప్రభుత్వం తీసుకునే విధాన నిర్ణయం...

- మిగతా 5వ పేజీలో...

జిల్లాలో ఎన్నికల పరిశీలకురాలి పర్యటన



కలెక్టర్, అధికారులతో సమావేశమైన ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మి

నల్లగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జడ్పీటీసీ గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు, ఐఏఎస్ అధికారి కొర్ర లక్ష్మి జిల్లాలో పర్యటించారు. జిల్లాకు వచ్చిన సందర్భంగా గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠితోపాటు పలువురు అధికారులు స్వాగతంపలికారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీవో అశోక్ రెడ్డి, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి రాజ్ కుమార్, జడ్పీ సీఈవో శ్రీనివాస రావు, పీపీవో వెంకయ్య, పశుసంవర్ధకశాఖ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కనగల్: నామినేషన్ స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మి ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని గురువారం కలెక్టర్‌తో కలిసి ఆమె పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, డీపీవో కె.వెంకయ్య, పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

సైన్స్‌తోనే మానవ మనుగడ

- డీఈవో బొల్లారం భిక్షపతి



విజేతలకు మెమెంటోలు అందజేస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సైన్స్‌పైనే మానవ మనుగడ ఆధారపడి ఉందని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. గురువారం ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైన్స్ డ్రామాలలో మహిళల పాత్ర, స్మార్ట్ వ్యవసాయం, డిజిటల్ ఇండియా, అందరికీ పరిశుభ్రత, గ్రీన్ టెక్నాలజీ అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన నాటకాలు ఆకట్టుకుంటున్నాయన్నారు. జిల్లా ప్రథమ స్థాయి విజేతలు ఈ నెల 17, 18వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, సాధియా పరహీన్, తస్లీమ్ ఫాతిమా, జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక.. లతీఫుల్లా షాఖాద్రి ఉర్సు

- ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్



గంధం ఊరేగిస్తున్న ముస్లింలు

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం గడియారం సెంటర్‌లోని చారిత్రాత్మకమైన హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి ఉర్సు మత సామరస్యానికి ప్రతీక అని శాసన మండలి సభ్యుడు కేతావత్ శంకర్‌నాయక్, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని మదీనా మసీదులో ప్రార్థన నిర్వహించి గంధం ఊరేగింపును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దర్గాకు వెయ్యేళ్ల చరిత్ర ఉందని, జిల్లా ప్రజలే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు దర్గాను దర్శించుకుంటారన్నారు. హిందువులు, ముస్లింలు ఐక్యమత్యంతో జరుపుకునే ఉత్సవమని, ఇదే సాంప్రదాయాన్ని భవిష్యత్‌లో కొనసాగించాలన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేకశ్రద్ధ తీసుకొని నిధులు మంజూరు చేయించి భక్తుల సౌకర్యం కోసం దర్గాకు ఘాటు రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాలు నెల రోజులపాటు భక్తితో సాగుతాయన్నారు. అనంతరం పట్టణ పురవీధులగుండా గంధం ఊరేగింపు సాగింది. గుట్టమెట్ల దగ్గరికి చేరుకోగానే జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు గంధానికి స్వాగతం పలికి దర్గాపైకి తీసుకెళ్లారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గంధాన్ని అదనపు ఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ప్రారంభించారు. గంధం ఊరేగింపులో మార్ఫా వాయిద్య కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. దర్గా ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సీఐలు, ఎస్ఐలు తమ పోలీస్ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, రాగూర్, శివ, ముతవలులు సమీల్లాఖాద్రి, జమాల్‌ఖాద్రి, ఉబేద్‌ఖాద్రి, సల్మాన్ ఖాద్రి, హాశం, ఇంతియాజ్ హుస్సేన్, మాజీ కౌన్సిలర్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు రెండు.. అంతలోనే ఆగిపోయే

నల్లగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తొలిరోజు రెండు ఎంపీటీసీ స్థానాలకు మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి. జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్లు ఒక్కటి కూడా దాఖలు కాలేదు. కనగల్ మండలం జి.యడవల్లి ఎంపీటీసీ స్థానానికి బీజేపీ అభ్యర్థి ఒక నామినేషన్ వేయగా, నార్కట్‌పల్లి-1 ఎంపీటీసీ స్థానానికి బీజేపీ అభ్యర్థి ఒక నామినేషన్ వేశారు. ఇంతలోనే హైకోర్టు ఎన్నికల ప్రక్రియను, నోటిఫికేషన్‌ను నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. చాలామంది అభ్యర్థులు హైకోర్టు తీర్పు వెలువడే వరకు వేచి చూడాలని ఆలోచించినందునే గురువారం నాడు పెద్దగా నామినేషన్లు దాఖలు చేయలేదని సమాచారం. మొదటి దశలో 18 జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ చేపట్టగా ఒక నామినేషన్ కూడా దాఖలుకాలేదు. 196 ఎంపీటీసీ స్థానాలకు రెండే రెండు నామినేషన్లు వచ్చాయి. మొత్తంగా ఎన్నికల ప్రక్రియ నిలిచిపోవడంతో అభ్యర్థులు నిరాశ చెందారు.

బీసీ రిజర్వేషన్లపై కుట్రలను తిప్పికొట్టాలి



గడియారం సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

నల్లగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ఆధిపత్య శక్తుల కుట్రలను తిప్పి కొట్టాలని విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లాకేంద్రంలోని గడియారం సెంటర్‌లో బీసీ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ ఉద్యమాల ఫలితంగా రాష్ట్ర అసెంబ్లీలో 42శాతం రిజర్వేషన్లపై ఏకగ్రీవంగా ఆమోదం తెలిపి గవర్నర్‌కు పంపారన్నారు. రిజర్వేషన్ల పెంపును అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 60 శాతానికి పైబడి బీసీలుండగా, 42శాతానికి అంగీకరించినప్పటికీ బీసీల ఫలాలను అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. బీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇస్తుంటే ఎవరు అడ్డుకున్నా ఊరుకోబోమన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, సతీష్ కుమార్, విజయ్ కుమార్, రాజు, రవి కుమార్, శ్రీకాంత్, తరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రావడానికి ఓటు చోరీ

- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్, చిత్రంలో గుమ్మల మోహన్ రెడ్డి, బుర్రి శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో అధికారంలోకి రావడానికి బీజేపీ ఓటు చోరీ చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. ఓటు చోరీపై జిల్లాకేంద్రంలోని 31వ వార్డులో గురువారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలో కూడా బీజేపీ ఓటు చోరీకి పాల్పడిందని ఆరోపించారు. రాత్రికి రాత్రే 60 లక్షల ఓట్లు నమోదు చేసిందన్నారు. దీనిని నిరసిస్తూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాదయాత్ర చేపట్టారని చెప్పారు. రాహుల్‌గాంధీ పిలుపు మేరకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రతీ గ్రామంలో 100కుపైగా సంతకాల సేకరణ నిర్వహించి రాష్ట్రపతికి, ఎన్నికల కమిషనర్‌కు పంపిస్తామన్నారు. ఈ నెల 15 వరకు జరిగే సంతకాల సేకరణ కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుమన్ పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య

ఖండించిన ప్రజాసంఘాల నేతలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మువ్వా రామారావు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని ప్రజాసంఘాల నేతలు ఖండించారు. పట్టణంలోని జ్యోతిబా పూలే భవనంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా జనవిజ్ఞానవేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ మువ్వా రామారావు మాట్లాడుతూ సీజేఐపై జరిగిన దాడి దేశ సర్వోన్నత న్యాయస్థానం, భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన దాడిగా భావించక తప్పడం లేదని, ఈ సంఘటన దేశ చరిత్రలో చీకటిరోజుగా గుర్తుండిపోతుందన్నారు. ప్రధాన న్యాయమూర్తిపై కోర్టు ఆవరణలో దాడి జరిగితే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. భావప్రకటన స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. విద్యా వికాసవేదిక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, భారత్ బచావో జిల్లా అధ్యక్షురాలు ఉదయ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కేవీపీఎస్ నాయకులు పరుశరాములు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సామాజిక కార్యకర్త డాక్టర్ జాడి రాజు, ప్రజాసంఘాల నాయకులు సత్యనారాయణ, రవినాయక్, కే.సుదర్శన్, హరికృష్ణ, యల్లయ్య, కాశీ, కిరణ్మయి, దశరథనాయక్, రాజారత్నం, సైదులు, స్వామి, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



తిప్పర్తి మండల పరిధిలోని జంగారెడ్డిగూడెంలో నేలకొరిగిన వరి

కురిసిన వాన.. పంటకు నష్టం

జిల్లాలోని పలు మండలాల్లో గురువారం వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో పంట చేలోకి నీరు చేరి, నేలకొరిగింది. దీంతో చేతికొచ్చిన పంట నేలవాలడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

బాలాజీ నాయక్ కోసం పోలీసుల వేట

- డిపాజిట్ల చట్టం కింద సుమోటోగా కేసు నమోదు



నల్లగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): అధికవడ్డీల ఆశ చూపి భారీగా నగదు సమీకరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలాజీ నాయక్ కోసం పోలీసులు వేట మొదలుపెట్టారు. పీఏపల్లి మండలం పలుగుతండాకు చెందిన ఆర్.బాలాజీ నాయక్‌పై డిపాజిట్ల చట్టం కింద పోలీసులు సుమోటోగా కేసు నమోదుచేసి, అతన్ని పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. ఇటీవల అప్పులిచ్చిన వారు బాలాజీ నాయక్ ఇంటిపై దాడిచేసి ఫర్నిచర్ ధ్వంసం చేయడం, అతనికి అప్పులిప్పించిన ఏజెంట్‌గా భావిస్తోన్న సరియా నాయక్ ఆత్మహత్య చేసుకోవడం వంటి కారణాల నేపథ్యంలో ఈ కేసు నమోదుచేశారు. వాస్తవానికి జూన్‌లోనే బాలాజీనాయక్ చట్టాలను అతిక్రమించి అధికవడ్డీల పేరుతో దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ ప్రాంతాల్లో కోట్లాది రూపాయల నగదు సేకరిస్తున్నారని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దేవరకొండకు చెందిన ఒక స్వచ్ఛంద సంస్థ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై విచారణ జరపాలని అప్పట్లోనే నల్లగొండ ఎస్పీకి, ఆదాయపన్ను శాఖాధికారులకు సూచించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పోలీసులు విచారణ చేయగా, పెద్దమనుషుల సమక్షంలో బాలాజీ నాయక్ అప్పులిచ్చిన వారికి మూడు నెలల్లోగా అందరికీ డబ్బులు తిరిగి ఇచ్చేస్తానని హామీ ఇవ్వడంతో వారెవరూ పోలీస్‌లకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. తాజాగా 15 రోజుల నుంచి మళ్లీ బాలాజీనాయక్ అందుబాటులో లేకుండా పోయారని, ఫోన్లు సైతం పనిచేయడం లేదని పేర్కొంటూ అప్పులిచ్చిన వారిగా చెబుతున్న పలువురు, కమీషన్లకు ఆశపడి మధ్యవర్తులుగా ఉన్నవారు ఆందోళన చెందుతుండడంతో మళ్లీ విషయం వెలుగులోకి వచ్చింది. స్వగ్రామమైన పలుగుతండాలో ఇంటి నుంచి బాలాజీనాయక్ తల్లిదండ్రులు సైతం వెళ్లిపోవడంతో అనుమానం చెందిన అప్పుల వాళ్లు ఇటీవల ఇంటిపై దాడిచేసి నిప్పుపెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా విషయం సంచలనంగా మారడంతో పోలీసులు స్పందించి సుమోటోగా కేసు నమోదు చేశారు. బాలాజీ నాయక్ ఆస్తుల వివరాలు చెప్పాలని రెవెన్యూ శాఖను పోలీస్ శాఖ కోరింది. తాజాగా గురువారం సైతం బాలాజీ నాయక్‌కు అప్పులిచ్చానని పేర్కొంటూ పలుగుతండాకే చెందిన లోక్యానాయక్ ఆత్మహత్యకు పాల్పడడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇదే సమయంలో బాలాజీనాయక్ అందుబాటులోకి రాకపోవడంతో మిర్యాలగూడలోని అతని సోదరుడి ఇంటివద్ద, నేరేడుచర్లలోని సోదరి ఇంటివద్దకు అప్పులిచ్చినవారు చేరుకొని ఆరా తీస్తున్నారు. బాలాజీ నాయక్‌కు అప్పులిచ్చిన వారు, అతని బాధితులు ఎవరైనా ఎవరికీ భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని కొండమల్లేపల్లి సీఐ నవీన్ కుమార్ తెలిపారు. బాలాజీ నాయక్‌పై రెండు రోజుల క్రితమే కేసు నమోదైందని, మరో రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామని దేవరకొండ ఏఎస్పీ మౌనిక తెలిపారు.

పోషకాహారంతోనే రక్తహీనత దూరం

సీడీపీవో చంద్రకళ



కేజీబీవీలో విద్యార్థినులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో చంద్రకళ.

మాడ్గులపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ప్రతినిత్యం పోషకాహారం తీసుకున్నట్లయితే రక్తహీనతకు దూరంగా ఉండవచ్చని సీడీపీవో చంద్రకళ అన్నారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా గురువారం కుక్కడం కేజీబీవీలో ఆమె కిషోర బాలికలకు పోషకాహారం, రక్తహీనతపై అవగాహన కల్పించి మాట్లాడారు. కిషోర బాలికలు ప్రతీరోజు తాము తీసుకునే ఆహారంలో తప్పనిసరిగా విటమిన్లు, మినరల్స్ వంటి పోషకాలు కలిగిన ఆహారాన్ని తప్పక తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగమణి, లక్ష్మి, కేజీబీవీ ఎస్‌వో వసంత, కేజీబీవీ టీచర్లు, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్ఎం ఝాన్సీ అంగన్‌వాడీ టీచర్లు ఊర్మిళ, జానకి, తిరుపతమ్మ, రజిత, సుశీల, మరియమ్మ, ఆశాలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ప్రత్యేక అలంకారంలో లక్ష్మీ నృసింహులు

6
5

దేవరకొండ డివిజన్‌లో భారీ వర్షం

- ఉరుములు, మెరుపులు, వాన
- వర్షానికి తడిసిన పత్తిచేలు నిండిన చెరువులు
- పిడుగుపడి 30 గొర్రెలు మృతి ● ఆందోళనలో పత్తి రైతులు

దేవరకొండ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పత్తి రైతులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, గంటలతరబడి విద్యుత్ రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. దేవరకొండ మండలం ముదిగొండ వద్యతండాలో గురువారం సాయంత్రం పిడుగుపడటంతో రాత్లావత్ శంకర్, రాత్లావత్ చందర్ రైతులకు చెందిన 27 మేకలు, గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో వద్యతండా సమీపంలోని చెట్ల కిందకు గొర్రెలు, మేకలు చేరగా పిడుగుపాటు చెట్టుపై పడటంతో అవి మృతి చెందాయి. వర్షాలకు చేతికొచ్చిన పత్తి పంట తడుస్తుండటంతో డివిజన్ పరిధిలోని దేవరకొండ, చందంపేట, నాంపల్లి, డిండి, నేరేడుగొమ్ము, పీఏపల్లి, చింతపల్లి, కొండమల్లేపల్లి మండలాలకు చెందిన పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నాంపల్లి మండలం పసునూరు చెరువు నిండి అలుగుపోస్తుంది. నాంపల్లి తహసీల్దార్ కార్యాలయంకు వెళ్లే రోడ్డు వర్షానికి కొట్టుకుపోయింది. తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


నేరేడుగొమ్ము మండలంలో వర్షానికి తడిసిన పత్తి


పిడుగుపాటుకు గురై దేవరకొండ మండలం వద్యతండాలో మృతి చెందిన గొర్రెలు, మేకలు

మండలం	వర్షపాతం (మి.మీ)
దేవరకొండ	31.8
డిండి	20.8
నిడమనూరు	20.5
కొండమల్లేపల్లి	17.5
చింతపల్లిలో	10.5
పడమటిపల్లి	9.5
తిరుమలగిరి	2.5


దేవరకొండ పట్టణంలో కురుస్తున్న వర్షం

కాన్షీరాం ఆశయ సాధనకు కృషి చేయాలి


కాన్షీరాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కాన్షీరాం ఆశయసాధనకు బహుజన్ సమాజ్ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని నియోజవర్గ అధ్యక్షుడు నాలి నాగరాజు అన్నారు. గురువారం పట్టణంలోని వై జంక్షన్ వద్ద కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగబద్ధంగా బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కాలన్న ఆకాంక్షతో కాన్షీరాం పోరాటం చేశారని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించి అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడిచి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పు ట్టల దినేష్, గాలిబ్, అనుదీప్‌రాజు, రాజేంద్రప్రసాద్, సైదమ్మ, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: బహుజన మేధావి కాన్షీరాం ఆశయ సాధనకు కృషి చేయాలని నియోజకవర్గ అంబేద్కర్ యువజన సంఘం ఇన్‌చార్జి నల్ల ఆంజనేయులు అ న్నారు. దేవరకొండలో కాన్షీరాం చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తు బహుజనుల పక్షాన పోరాడిన యోధుడు కాన్షీరాం అని పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదివి బహుజనులపక్షాన పోరాడి ఉత్తరప్రదేశ్‌లో బహుజన రాజ్యాధికారాన్ని తీసుకువచ్చిన మేధావి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యు వజన సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పెరుమళ్ల అనిల్‌కుమార్, ముత్తయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


దేవరకొండ: కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నేతలు

పిల్లలు పోషకాహారాన్ని తీసుకోవాలి

- ఐసీడీఎస్ చింతపల్లి సీడీపీవో సక్కుబాయి


పీటీనగర్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సక్కుబాయి

చింతపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పిల్లలు పోషకాహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీవో సక్కుబాయి తెలిపారు. పోషణమాసంలో భాగంగా మండలంలోని వెంకటేశ్వరనగర్ జడ్పీహెచ్ఎస్‌లో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. క్యారెట్, బీట్‌రూట్, బొప్పాయి, పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తినడం వల్ల రక్తహీనత నుంచి విముక్తి పొందే అవకాశం ఉంటుందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్లు బాదేపల్లి స్వప్న, ప్రభావతి, పారిజాత, లీలావతి, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బీసీలను మభ్య పెడుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు చిలకల వెంకన్న ఆరోపించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్ల కల్పిస్తామని హడావుడి చేసిన రేవంత్ సర్కార్ బీసీలను చాకచక్యంగా తప్పుదోవ పట్టిస్తుందన్నారు. ఇప్పుడు ప్లాన్-బీ అమలు చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీలను అయోమయంలో పెడుతున్నారని విమర్శించారు. నాడు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించారని, సామాన్య ప్రజలను రాజకీయాలకు దగ్గర చేశారని గుర్తు చేశారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే తెలంగాణ బంద్‌కు తమ మద్దతు ఉంటుందన్నారు.

● బీసీల నోటి కాడ ముద్దను లాక్కోవడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించే హక్కు రాజ్యాంగం కల్పించినప్పటికీ రాజకీయ జూదంలో వెనుకబడిన వర్గాలు దగాకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు అన్ని పార్టీలు మద్దతిచ్చి, ఏకగ్రీవ తీర్మానం చేసినా బీసీలకు న్యాయం జరగడం లేదన్నారు. అగ్రకుల నాయకులు న్యాయస్థానాలను ఆశ్రయించి బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడటం సరికాదన్నారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకన్న

మొక్కలు నాటి సంరక్షించాలి

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఎంఈవో వెంకటయ్య పిలుపునిచ్చారు. మండలంలోని దుగ్యాల ఆదర్శ పాఠశాలలో గురువారం జరిగిన వనమహోత్సవంలో మొక్కలు నాటారు. వనమహోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలిసి సుమారు 500 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. శ్రీనయ్య, ఉపాధ్యాయులు సరిత, పద్మావతి, సునీత, గోపాల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు

న్యూస్ బాక్స్

పేదలను ఆదుకునేందుకు కృషి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకునేందుకు గంగమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు చల్లా వెంకన్న- లక్ష్మీ తెలిపారు. పట్టణానికి చెందిన ఎన్నారైలు చల్లా పవన్ యాదవ్, కొండూరు చక్రవర్తి సంయుక్తంగా స్థాపించిన గంగమ్మ ఫౌండేషన్ ద్వా రా పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు విద్య, వైద్య, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 4వ వార్డు, గొల్లగూడలోని వృద్ధ, దివ్యాంగులకు రూ.1.15 లక్షల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ సభ్యుడు దారం మల్లేష్, బొడ్డు రమేష్, సైదులు, చల్లా వెంకట్, నర్సింహ, చిమట వెంకటరామయ్య, క్రాంతి కుమార్, రియాజ్ పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే ఉత్తమ ర్యాంకులు


విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మిర్యాలగూడటౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చని లోటస్ ఉన్నత పాఠశాల చైర్మన్ బొడ్డుపల్లి వరప్రసాద్ అన్నారు. మెడిసిన్ సీటు సాధించిన పాఠశాల పూర్వ విద్యార్థిని వెంపటి సాయిసహస్రను గురువారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే అనుకున్నది సాధించవచ్చన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉన్నత విద్య, ఉద్యోగాలకు తీవ్రతరమైన పోటీ ఉందని, ఆ పోటీని దీటుగా ఎదుర్కోవాలంటే దీక్ష బూనినట్లు చదవాలని సూచించారు. పాఠశాల తొలి నీట్ ర్యాంకర్ సాయి సహస్రను జూనియర్ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి వెంకన్న, అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌కుమార్, అజీముద్దీన్, సరిత, కావ్య, సురేష్, శ్రీనివాస్, లతీఫ్, సతీష్ పాల్గొన్నారు.

సతీష్‌గౌడ్ మృతి పార్టీకి తీరని లోటు

హాలియా, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అనుముల మండలం పాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు కాట్నం సతీష్‌గౌడ్ మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. సతీష్‌గౌడ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన గురువారం గ్రామానికి వెళ్లి అతని మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అ ధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, మార్కెట్ మాజీ డైరెక్టర్ సురభి రాంబాబు, మండల యూత్ అధ్యక్షుడు కాట్నం నాగరాజుగౌడ్, నాయకులు బిళ్లకంటి శ్రీనివాస్, జక్కుల శ్రీనివాస్, పగిళ్ల వెంకన్న, కాట్నం సైదులు, గౌరు సాయి, కాట్నం నాగరాజు, మామిడి శంకర్, కత్తుల సోమయ్య, బ్రహ్మచారి, సాయి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ పట్టణంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 420 హామీలు, 6 గ్యారంటీలను అమలు చేస్తానని హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తానని ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. వృద్ధులకు రూ.4వేల పింఛన్ గురించి మాట్లాడటం లేదన్నారు. ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించి గుణపాఠం చెప్పాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని, ప్రజలు బీఆర్ఎస్ పక్షాన ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్, కేతావత్ బీల్యానాయక్, నేనావత్ కిషన్‌నాయక్, వెంకటేశ్వరరావు, రాఘవచారి, ప్రవీణ్‌రెడ్డి, వేముల రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయం


విద్యార్థులకు బెల్టులు, ఐడీ కార్డులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

నిడమనూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమని ఎంఈవో లావూరి వెంకన్న అన్నారు. మండలంలోని తుమ్మడం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఆర్థిక సహకారంతో సమకూర్చిన బెల్టులు, ఐడీ కార్డులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. విద్యార్థులకు చేయూతనిచ్చిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం పుట్టా నాగయ్య, ఉపాధ్యాయులు లింగంపల్లి అంజయ్య, సింధుజా, మాధవి, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు

చింతపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బీసీలను మోసం చేస్తూ చిత్తశుద్ధి లేకుండా పరిపాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా 42 శాతం బీసీల రిజర్వేషన్లతో కాలయాపన చేస్తూ సమస్యలను పక్కనపెట్టడం బాధాకరమన్నారు. గ్రామాల్లో మౌలిక వసతి సౌకర్యాల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రిజర్వేషన్ పేరుతో బీసీలను బలిపశువులుగా వినియోగించుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్, నాయకులు కుక్కడపు రామకృష్ణ, దావా శ్రీనివాస్, న్యాయవాది గుర్రం వెంకటరమణ, బొడ్డు మహేష్ గౌడ్, కుందేళ్ల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో 20 శాతం కేటాయించాలి


ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న గౌడ సంఘం నాయకులు

హాలియా, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల్లో గౌడ సామాజిక వర్గానికి 20 కేటాయించాలని గౌడ సంఘం మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు గుండు శ్రీరాములుగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాకునూరి నారాయణ గౌడ్ అన్నారు. హాలియా మునిసిపాలిటీలో గురువారం నిర్వహించిన గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. గౌడ కులస్థులకు కేటాయించిన మద్యం దుకాణాల్లో బినామీలు కలుగజేసుకోవద్దన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో రానున్న రోజుల్లో మాజీ ఎమ్మెల్యే నిమ్మల రాములు గౌడ్, బహుజన రాజ్యాధికారం పాటుపడిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాల ఏర్పాటుకు సంఘం కృషి చేయనున్నట్లు తెలిపారు. క్యాక్రమంలో గౌడ సంఘం నాయకులు రఘుగౌడ్, రమేష్‌గౌడ్, హన్మంత్, మల్లేష్, పోలగాని నర్సింహ, పోషం శ్రీనివాస్‌గౌడ్, పోలగాని సైదులు, రావుల వెంకటేశ్వర్లు, గుండెబోయిన వేణు, కాట్నం యాదగిరిగౌడ్, గౌడ కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

పెద్దవూర, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఏనెమీదిగూడెం గ్రామానికి చెందిన నిర్మటి సునీత ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంకణాల నివేదితరెడ్డి ఆదేశాల మేరకు గురువారం బీజేపీ జిల్లా కార్యదర్శి ఏరుకొండ నరసింహ గ్రామానికి చేరుకొని కూలిపోయిన సునీత ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు వెంటనే బాధితురాలు సునీత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. సునీతకు ఇందిరమ్మ ఇంటిని వెంటనే మంజూరు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పలుస రవి, నాయకులు పాల్గొన్నారు.